


ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు





సంపుటి : 14 సంచిక : 05 జనవరి 2009

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 15/-



చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551


ఈ సంచికలో....


చింతపర్రు ............ 05-09-08
జిన్నూరు ............. 02-11-08
తాడేపల్లిగూడెం .... 12-07-08
కాపవరం ............ 09-12-08
గొరగనమూడి ...... 27-11-08



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 5-9-08, చింతపర్రు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఎన్ని విద్యలు నేర్చుకొన్నా మనకు తత్వం తెలిసేవరకు పునర్జన్మలు రావటం ఆగవు. తత్వం తెలిసేవరకు ప్రతిజన్మలోను ఏదో శవాన్నిమోస్తూ ఉండాలి. తత్వం అంటే నీవు ఏవస్తువును తెలుసుకోవటానికి సాధనలు చేస్తున్నావో, యజ్ఞాలుయాగాలు చేస్తున్నావో అది ఎవరో కాదు, అది నీవై ఉన్నావు. అది నీకు అనుభవంలోనికి రావాలి. అది నీ మాటలకు, మనస్సుకు, బుద్ధికి అందదు. అయితే అది ఎవరికి అనుభవం లోనికి వస్తుంది? బాహ్య ప్రక్రియల వలన అది అనుభవంలోనికి రాదు ఎందుచేతనంటే అది బాహ్యంగా లేదు, అది నీ హృదయంలోనే ఉంది, మంచితనం ఉంటే అది వస్తుంది అని సోక్రటీస్ చెప్పాడు. మేము మంచివారము, మేము మంచివారము అనుకొంటున్నారు. నిజంగా మీరు మంచివారు అయితే మీకు ఆత్మజ్ఞానం ఎందుకు రావటంలేదు అని అడుగుతున్నాడు. మంచిపనులు చేసేవారు అందరూ మంచివారు అని కాదు. మంచి చేయటం వేరు, మంచిగా ఉండటం వేరు. మంచి పనులు చేసేవారికి పుణ్యం వస్తుంది కాని ఆత్మజ్ఞానం రాదు, మంచిగా ఉన్నవారికి ఆత్మజ్ఞానం వస్తుంది. కొంతమంది ఇతరులు చూస్తూ ఉంటే మంచి చేస్తారు, ఇతరులు చూడకపోతే చేయరు. మీకు ఇతరులు కావాలి కాని దేవుడు అక్కరలేదు. మనం ఏ పని చేసినా, నోటితో ఒకమాట మాట్లాడినా, మనస్సులో ఒక ఆలోచన వచ్చినా ప్రతీదీ భగవంతుడు చూస్తున్నాడు. మీరు చేసే మంచిపని ఎవరూ చూడటం

లేదు అనుకో, మీరు చేసే పనిని ఈ తరంవారు గుర్తించే అవకాశం లేదు, రాబోయే తరంవారు కూడా గుర్తించే అవకాశం లేదు అయినప్పటికీ మీరు మంచి చేస్తూ ఉంటే మీరు నిజంగా మంచివారు, అటువంటివారికి ఆత్మజ్ఞానం కలుగుతుంది కాని మిగతావారికి ఆత్మజ్ఞానం సున్నా అని సోక్రటీస్ చెప్పాడు. మనం ఇంటి దగ్గర కూర్చొని మేము మంచివారము అనుకొంటున్నాము, మనం మంచివారము కాదన్న సంగతి మనకు తెలియటం లేదు. ఆ వివేకం, విచక్షణ మనకు లేదు, అర్థంచేసుకోవటానికి తగిన వైరాగ్యం మనకు లేదు. మన బుద్ధిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. మనకు సహృదయం ఉంటే, సద్బుద్ధి ఉంటే మన బుద్ధే మనకు పాఠాలు చెపుతూ ఉంటుంది. మన బుద్ధిని మనం కాపాడుకోకపోతే మనకు ఎంత ధనం ఉన్నా, ఎంత అధికారం ఉన్నా ఏమీ ప్రయోజనం లేదు.

కోరిక వలన విరోధాలు వస్తాయి, ద్వేషాలు వస్తాయి, దుఃఖం వస్తుంది. ఒక కుటుంబంలో పేచీలు ఎక్కువ ఉన్నాయి అంటే అక్కడ కోరికలు ఎక్కువగా ఉన్నాయని అర్థం. ఆచార్యులవారు ఏమన్నారు అంటే నీ దగ్గర పదిరూపాయలు ఉన్నాయి అనుకో, ఆ పదిరూపాయలు చూడగానే నాకు కావాలనిపిస్తుంది. నువ్వు కూడా నేనే, నీకు నాకు బేధం లేదు అన్న సంగతి నాకు తెలిస్తే ఆ పదిరూపాయలు నా మనస్సు కోరదు అని చెప్పారు. నువ్వు జపం చేసినప్పుడు, ధ్యానం చేసినప్పుడు కోరికలు కొంతకాలం అణిగి ఉంటాయి, ఇవన్నీ టెంపరరీ. మీకు సబ్జక్టు ప్రోపర్‌గా అర్థం కాకుండా మీరు సాధనలు చేసిన వాటి వలన తాత్కాలిక ప్రయోజనమే కాని పెర్మనెంట్ సొల్యూషన్ రాదు. బయట ఏదో ఉంది, ఏదో ఉంది అని మనం అనుకోవటం వలన మనకు ఆశ కలుగుతుంది. ఆశ వలన మనం పాపం చేస్తాము, ఆశలేనివాడు పాపం చేయడు. మనం స్వార్థంతో పని చేయటం వలన పాతవాసనలు అలాగే ఉంటాయి, కొత్తవాసనలు వచ్చి కలుస్తూ ఉంటాయి, దానివలన పునర్జన్మలు పెరిగిపోతాయి. స్వార్థం లేకుండా పనిచేస్తూ ఉంటే పునర్జన్మలు తగ్గుతాయి. అందుచేత మనం పని పని కోసమే చేయాలి, ఈశ్వరప్రీత్యర్థం పనిచేయాలి. భయం, కోపం, ద్వేషం ఇవిఅన్నీ ద్వైతంలో నుండే వస్తున్నాయి. మనం సద్గురువు పాదాలను ఆశ్రయించి, శాస్త్రాన్ని ఆధారంగా చేసుకొని జీవిస్తూఉంటే మనకు అద్వైతానుభవం కలుగుతుంది కాని లేకపోతే మనం ఇక్కడ ఉన్నా ద్వైతమే, ఈ శరీరం చనిపోయినా ద్వైతమే. ఎవరో వచ్చి మిమ్మల్ని శిక్షించనక్కరలేదు. ఎవరి మనస్సు వారికి శిక్ష. ఇది చేయతగిన పని, ఇది చేయకూడని పని అని పరమాత్మ గీతలో చెప్పాడు. ఆయన వద్దని చెప్పిన పనిని

మనం చేయకూడదు, ఆయన చేయమని చెప్పిన పనిని చేయాలి. భగవంతుడు ఏ పని అయితే చేయమని చెప్పాడో అది మనకు కలిసి వచ్చినా, రాకపోయినా ఆ పనులు చేస్తూ ఉంటే కాలప్రవాహంలో మనకు తెలియకుండా మనస్సు నశిస్తుంది.

చెడ్డ చెయ్యాలని ఎవరికీ ఉండదు కాని అందరూ చెడ్డ ఎందుకు చేస్తున్నారు అని అడిగితే ఆశవల్ల చేస్తున్నారు అని పరమాత్మ చెప్పాడు. మీకు డబ్బు ఉంటే దానిని నిగ్రహించుకోవాలి, మీకు చదువు ఉంటే దానిని నిగ్రహించుకోవాలి. నిగ్రహించుకోకపోతే మీరు పాడైపోతారు. మీకు ఏది ఉన్నా దానిని నిగ్రహించుకోవాలి, కామన్‌మేన్‌గా ఉండాలి. అంతేగాని మనలో ఏదే విశేషం ఉంది అని అనుకొంటారు అనుకోండి, అది నిజం కాదు, మీ మనస్సే అలా తోపింపచేస్తుంది, అదే మాయ. మనస్సుకు సరియైన శిక్షణ ఇవ్వటమే, మనస్సును ఎడ్యుకేట్ చెయ్యటమే మన జీవితలక్ష్యం. ఇక్కడ మేము చెప్పేదంతా 100% ఎడ్యుకేషన్. మనం మంచివారము కాకపోయినా మేము మంచివారము అనుకొంటూ మనలను మనం వంచన చేసుకొంటున్నాము. మన గురించి మనకు సరియైన అంచనా ఉండాలి. మనలో ఉన్న బలహీనతలు ఏమిటి అని చూసుకొని వాటిలో నుండి విడుదల పొందటానికి ప్రయత్నం చేయాలి. బలహీనతలలో నుండి విడుదల పొందాలి అంటే కేవలం తెలివితేటలు సరిపోవు, దానికి సత్పురుషుల సహవాసం ఉండాలి. ఏదైనా ఒక పని పూర్తి అవ్వాలంటే స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వరకటాక్షం ఈ మూడూ ఉంటేగాని పని పూర్తి అవ్వదు. మనం ఏవో కోరికలు పెట్టుకొని తిరుపతి వెళతాము. అక్కడ దేవుడి దగ్గరకు వెళ్ళి ఆ కోరికలను తలపెట్టుకొంటూ ఉంటాము. మీకు భక్తి ఉన్నమాట నిజమేకాని మీకు దేవుడి మీద భక్తి లేదు, మీ కోరిక మీద భక్తి ఉంది. అది భగవంతుడికి తెలుస్తూ ఉంటుంది. స్వార్ధపరులు తమ స్వార్ధం కోసం ఎలా కష్టపడి, కష్టపడి పనులు చేసుకొంటారో అలాగ లోకకళ్యాణం కోసం, లోకక్షేమం కోసం ఎవడైతే కష్టపడి పనిచేస్తున్నాడో వాడే మహాత్ముడు, వాడే యోగి, వాడే సత్పురుషుడు, వాడే మహర్షి. అటువంటివాడికి వాడు అడగకుండానే నా స్వరూపాన్ని వాడికి ఇస్తాను అని పరమాత్మ చెప్పాడు.

మీ వలన ఏదైనా పని అయ్యింది అనుకోండి, దానికి మీరు కారణం కాదు, ఈశ్వరుడే కారణం, చేసేవాడు అంతా ఆయనే, జరిగేదంతా ఆయన సంకల్పమే. మనం ఏదైనా పని సాధిస్తే మేమే చేసాము అంటాము. పని సాధించకపోతే వారు అడ్డువచ్చారు, వీరు అడ్డు

వచ్చారు సాధించలేకపోయాము అని ఎవరిమీదో పెట్టేయటానికి చూస్తాము. ఇది మనస్సులో ఉన్న బలహీనత. ముందు మన మనస్సులో ఉన్న బలహీనతలను చూసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. ఈశ్వరుడి పాదాలపట్ల మనకు భక్తి లేదు. మనందరము భక్తులము అని పిలువబడే భక్తులం అంటే భక్తులు కాకపోయినా బజారులో భక్తులుగా చెలామణి అయిపోతున్నాము. ఈశ్వరుడిపట్ల మనకు అకారణభక్తి ఉండాలి అంటే ఈశ్వరుడిపట్ల ప్రేమ ఉండాలి, ఈశ్వరునిపాదాలయందు గౌరవం ఉండాలి, ఎందుకు ఈశ్వరుడిని ప్రేమిస్తున్నాము అంటే కారణం కనబడకూడదు. ప్రేమించటంకోసమే ప్రేమించాలి. ఈశ్వరుని యొక్క దయ లేకుండా మనకు అద్వైతవాసన కూడా కలుగదు, అద్వైతవాసన లేకుండా మీకు అద్వైతానుభవం కలుగదు. మనం నేను, నాది అని ఎక్కువగా వాడుతూ ఉంటాము. ఇక్కడ చాలా శరీరాలు ఉన్నాయి కాని ఈ శరీరమే నేను అనుకొంటాను ఇక్కడ చాలా వస్తువులు కనిపిస్తున్నప్పటికీ ఈ గ్లాసే నాది అనుకొంటాను. నేను అనేది ఒక తలంపు, నాది అనేది ఒక తలంపు, ఇవి నిజం కాదు. వీటిలోనుండి విడుదల పొందకుండా బ్రహ్మపదార్థం నీకు తెలియదు. బయట సూర్యుడు ఉన్నా కాని మబ్బులు ఉంటే సూర్యుడు మనకు కనబడడు. సూర్యుడు మనకు కనబడటం లేదు కాబట్టి అక్కడ సూర్యుడు లేడు అని కాదు. అలాగే జ్ఞానసూర్యుడు నీ హృదయంలో ఉన్నాడు, ఆయన నీకు గోచరించకుండా ఈ నేను, నాది తలంపులే అడ్డువస్తున్నాయి. ఈ తలంపులనుండి విడుదల పొందకపోతే నీలోపలే జ్ఞానసూర్యుడు ఉన్నా ఆయన నీకు గోచరం కాడు.

మీకు దుఃఖ కారణాలు ఉన్నా దుఃఖపడకండి. ఏ కారణం వలన దుఃఖం వచ్చినా మీరు అజ్ఞానంలో ఉన్నట్లే. దుఃఖకారణం ఉన్నప్పటికీ దుఃఖం లేకుండా ఎవరైతే ఉంటున్నారో, అశాంతి కారణం ఉన్నప్పటికీ అశాంతి లేకుండా ఎవరైతే ఉంటున్నారో వారు ఈశ్వరుని దయకు పాత్రులవుతారు. మీరు పొంగలి నోట్లో వేసుకొంటే, మైసూర్‌పాక్ నోట్లో వేసుకొంటే ఆ స్వీట్‌ను ఎలా ఎంజాయ్ చేస్తున్నారో, ఒకవేళ మీకు చెడుప్రారబ్దం ఉన్నా ఆ ప్రారబ్దాన్ని అలాగ ఎంజాయ్ చేస్తూఉంటే రాబోయే జన్మలలో ఆ ప్రారబ్దం రాదు. తిలక్‌గారు గొప్ప నాయకుడు. భయం అంటే ఏమిటో ఆయనకు తెలియదు. దేశానికి స్వాతంత్ర్యం సంపాదించాలి అనేటువంటి గమ్యంలో ఆయనకు వ్యక్తిగతంగా ఎన్ని దుఃఖాలు వచ్చినా ఆయన ఏమీ పట్టించుకోలేదు, దురదృష్టం వెంటాడుతున్నప్పటికీ వారు ఎప్పుడూ విషాదానికి గురి కాలేదు. ఎందుచేతనంటే దేశాన్ని ప్రేమించే ఆ పద్ధతిలో, ఆ విశాలమైన హృదయంలో,

ఆ విశాలమైన ప్రేమలో వ్యక్తిగతమైన విషయాలు వారికి బాగా చిన్నవిగా కనిపించేవి.

మీరు గమ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేయాలి కాని కేవలం 24 గంటలు ఈ శరీరం గురించి, ఈ లోకం గురించి ఆలోచిస్తూ కూర్చోకూడదు. పరిస్థితులు అనుకూలంగా ఉంటే పొంగిపోకూడదు, పరిస్థితులు అనుకూలంగా లేకపోతే కుంగిపోకూడదు. పొంగిపోయేది, కుంగిపోయేది ఎవరు అంటే ఈ మనస్సే. అందుచేత మనం ముందు ఈ మనస్సును సరిచేసుకోవాలి. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టి మీరు ఆత్మజ్ఞాన సముపార్జనకు ప్రయత్నం చేసుకోవాలి. శరీరం ఎక్కడ ఉన్నా నీ మనస్సును మటుకు ఈశ్వరుడి పాదాల మీద నిలబెట్టి ఉంచు. మనకు విషయచింతన తప్పించి భక్తి ఏమీ లేదు. మనం ఆత్మానందం ఇంకా రుచి చూడలేదు, ఎంతసేపు విషయానందంలో ఉంటున్నాము. ఈ విషయానందం భవిష్యత్తులో రోగాలకింద, దుఃఖం కింద మారిపోతుంది. మనకు భక్తి లేకపోయినా, మనం భక్తులం అని ఇతరులు చెప్పకొంటే సరిపోతుంది. మీకు కోటి రూపాయలు అప్ప ఉంది అనుకోండి. బయట అందరూ మీకు కోటి రూపాయలు నిల్వ ఉంది అని చెప్పకోవటం వలన మీకు లాభం ఏమిటి? అలాగే మీ దగ్గర చాలా డబ్బు ఉంది అనుకోండి, మీరు చాలా అప్పలలో ఉన్నారు అని బయటవారు అనుకొంటున్నారు అనుకోండి, దాని వలన మీకు వచ్చే నష్టం ఏమిటి? అసలు ఇలా అనుకోవటం వలన ఏమీ లేదు. మన కళ్ళతో మనలను మనం చూసుకోవాలి గాని ఇతరులకళ్ళతో మనలను చూసుకోకూడదు, ఇతరుల కళ్ళతో మనలను చూస్తూ ఉంటే అది పిరికితనానికి గుర్తు. అందుచేత మీ కళ్ళతో మిమ్మల్ని మీరు చూసుకోండి. ఆత్మవిశ్వాసం లేనివాడికి, ఆత్మబలం లేనివాడికి ఆత్మజ్ఞానం రాదు.

మన ఇంట్లో ప్రేమలు కూడా నిజంకాదు. అసలు మానవతా అనుబంధాలన్నీ స్వార్ధపూరితమైనవి. బుద్ధిసూక్ష్మతతో చూస్తే అది స్పష్టంగా తెలుస్తుంది. మన బుద్ధి ఎలుక బుద్ధి. ఎలుకలు చూడండి ఏది దొరికితే అది పట్టుకొనిపోయి కన్నంలో పెట్టేసుకొంటుంది. ఎలుకలు తినేది తక్కువేగాని ఎక్కువగా పట్టుకొనిపోయి కన్నంలో స్టోరేజ్ చేస్తుంది. మనం కూడా అంతే తిన్నది తింటాము మిగిలినది రేపు తిందాము, రేపు తిందాము అనుకొంటాము గాని ఇతరులకు పెట్టము. రేపు మనం తిందాము అనుకొనేటప్పటికి అది వాసన వచ్చేస్తుంది, పెంట మీద పడేస్తాము. ఎలుకకు వాండరింగ్ ఎక్కువ. ఎలుక పరుగెత్తినట్లే మనం కూడా పరుగెడుతూ ఉంటాము. మనం 50 కోట్లు సంపాదించాము అనుకోండి, 50 కోట్లు

సంపాదించామ కదా, సరిపోతుంది అని పూరుకోము, ఇంకొక 50 కోట్లు సంపాదించటానికి చూస్తాము. డబ్బు సంపాదించటం కూడా ఒక వ్యసనమే. దానికి ముగింపు ఉండదు, సంపాదనే కాదు ఏ అలవాటు అయినా అంతే. మనం జీవశక్తిని పాడుచేసుకొంటున్నాము. మనకు లోచూపు లేదు, భగవంతుడి స్మరణ లేదు. ఎంతసేపు విషయాలను స్మరిస్తూ శక్తిని వృధా చేసుకొంటున్నాము. మనం ఎక్కువగా భోగాలు అనుభవిస్తూ ఉంటే శక్తి వృధా అవుతుంది, కాలం వేస్టు అయిపోతుంది, ఇహానికి, పరానికి పనికిరాకుండా పోతాము. సమాజంలో మంచీ ఉంది, చెడ్డా ఉంది. మనం సమాజంలో ఉన్న చెడ్డను తీసుకొంటున్నాము. చీమలకు ఉన్న తెలివితేటలు కూడా మనకు లేవు. మనం ఇసుకను, పంచదారను కలిపేస్తే చీమ ఏమి చేస్తుంది అంటే పంచదారను తినేసి ఇసుకను వదిలేస్తుంది. అలాగే మనం కూడా సమాజంలో ఉన్న మంచిని గ్రహించి, చెడ్డను విసర్జించాలి. మనకు సినిమాలకు వెళ్ళటానికి టైముఉంది కాని చెడుస్నేహాలు చేయటానికి టైముఉంది కాని దైవచింతనకు మనకు టైము లేదు. ఎందుచేతనంటే మన బుద్ధి మంచిదికాదు. ఎవరైనా దుర్మార్గులతో సహవాసం చేస్తున్నారు అనుకో, మీకు శక్తి ఉంటే ఆ సహవాసాలలో నుండి వారిని విడిపించగలిగితే దానివలన కూడా మీరు ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు. నీకు దుష్ట సహవాసం చేయవలసిన పరిస్థితులు వస్తే, ఆ పరిస్థితులలో పడేబదులు పులినోట్లో తలకాయ పెట్టటం మంచిది అని మద్వాచార్యులవారు చెప్పారు. పులినోట్లో తలకాయ పెట్టటం వలన ఆ శరీరం ఒక్కటే పోతుంది. కాని దుష్టసహవాసం చేస్తే చెడ్డవాసనలు, చెడ్డఅలవాట్లు వస్తాయి, అవి అనేక జన్మలకు కారణం అవుతాయి. వారు చెడ్డవారు, వీరు మంచివారు అని ఇలా మనుషులను విడదీయవద్దు. అందరి హృదయాలలో ఉన్న భగవంతుడిని చూడటం నేర్చుకో. మంచి, చెడ్డ అనేది మనస్సుకు సంబంధించినది, ఇవి అన్నీ పైపై గొడవలు, ఆ గొడవలు నీకెందుకు? అందరి హృదయాలలో ఉన్న ఈశ్వరుడిని చూడటం నేర్చుకో. అప్పుడు మీకు వికారాలు కలుగవు, మీకు వేరుబుద్ధి పోతుంది. వేరుబుద్ధి నశించేవరకు లోపల ఉన్న సత్యం మీకు గోచరించదు.

వాడికి ఉన్న చెడు అలవాట్లనుబట్టి వీడు చెడ్డవాడు, వాడికి ఉన్న మంచి అలవాట్లను బట్టి వీడు మంచివాడు అంటున్నాము కాని చెడ్డవాడి హృదయంలో ఏదైతే ఉందో, మంచివాడి హృదయంలోకూడా అదే ఉంది, అక్కడా నేను ఉన్నాను, ఇక్కడా నేను ఉన్నాను, అసలు నేను లేకుండా శరీరంరాదు, వారి గుణాల గొడవ నీకు ఎందుకు? అందరిలో ఉన్న నన్ను చూడటం నేర్చుకో. నువ్వు యోగివి అవుతావు అని పరమాత్మ చెపుతున్నాడు. నిరంతరం

ఆత్మ గురించి శ్రవణం చేయండి. నిరంతరం ఆత్మ గురించి మననం చేయండి. నిరంతరం ఆత్మ మీద ధ్యాస పెట్టండి. వినండి, వినండి అంటే చెవులతో వినటం కాదు. మనస్సుతో వినాలి, మనస్సుతో వినటానికి చెవులు వూరికే పనిముట్లు. మీరు ఆత్మ గురించి అలా వినగా వినగా దాని విలువ మీకు తెలుస్తుంది, దాని రుచి మీకు తెలుస్తుంది. సత్వగుణం యొక్క గొప్పతనం ఏమిటి అంటే అక్కడ యాక్షనేగాని రియాక్షన్ ఉండదు. అందుచేత మనం సత్వగుణాన్ని ప్రాక్టీసు చేయాలి. సత్వగుణాన్ని ప్రాక్టీసు చేస్తూ ఉంటే మంచిమాటలు వినాలనే బుద్ధి కలుగుతుంది, శాస్త్రాన్ని శ్రవణం చేయాలనే బుద్ధి కలుగుతుంది. శాస్త్రానుగ్రహం లేకుండా, ఈశ్వరానుగ్రహం లేకుండా మీరు ఆత్మజ్ఞానానికి అర్హులేకాదు. మీకు పునర్జన్మ రాకుండా ఉండాలంటే ఒకటి గుర్తు పెట్టుకోండి. ప్రతీ శరీరం కూడా ఏదో రోజున చనిపోతుంది. ఆ శరీరం చనిపోయేటప్పటికి బాహ్యమైన వ్యక్తులతోటిగాని, సంఘటనలతోగాని, వస్తువులతోగాని సంబంధం లేకుండా నూటికి నూరుపాళ్ళు స్వతంత్ర్యమైన శాంతి, స్వతంత్ర్యమైన ఆనందంలో మీ మనస్సు ఊగిసలాడుతూ ఉంటే ఇంక మీకు పునర్జన్మ రాదు. భవిష్యత్‌లో ఏ రకమైన శరీరం రాకుండా ఉండటం కోసం ఎలా జీవించాలో అలా జీవించేవాడే నిజంగా జీవించినవాడు.

మేము జనరల్‌గా మీటింగులలో ముందు డ్యూటీ తరువాత దేవుడు అని చెపుతూ ఉంటాము. రామకృష్ణ పరమహంసగారు ముందు దేవుడు, తరువాత డ్యూటీ అనేవారు. స్వప్నం గొడవ వదిలేయండి, ఈ జాగ్రదవస్థ కూడా నిజంకాదు అని చెప్పేవారు. ఇప్పుడు మనందరం మెలకువగా ఉన్నాము. మెలకువలో ఉన్నవాడిని వేకర్ అంటాము, నిద్రపోయేవాడిని స్లీపర్ అంటారు, కలలు కనేవాడిని డ్రీమర్ అంటారు. ఈ వేకర్, స్లీపర్, డ్రీమర్ కూడా ఉన్న సద్వస్తువు మీద ఆరోపించబడ్డాయికాని ఈ ముగ్గురూ నిజంకాదు, ఇదంతా మనస్సు యొక్క కల్పితం. ఒక్క బ్రహ్మం తప్పించి మిగిలినది అంతా మనస్సు యొక్క కల్పితం. ఉపవాసం దేహఆరోగ్యానికి, మానసికఆరోగ్యానికి మంచిదే. ఉపవాసం రోజున మీరు సహనం కూడా నేర్చుకోవాలి. ఉపవాసం వల్ల మీరు సహనం నేర్చుకోకపోతే మీకు ఉపవాస ఫలితం రాదు అని అల్లా చెప్పాడు. మనస్సును మనస్సుతోటి నిరోధించండి. మీ మనస్సును మీరు బాగుచేసుకోండి. మనస్సులో మంచి, చెడ్డ ఉంటుంది, పుణ్యం పాపం ఉంటాయి. మీ మనస్సులో ఉన్న మంచిని కాపాడుకొంటూ, దానికి బలం చేకూర్చి, ఆ మంచిమనస్సుతోటి మీ మనస్సులో ఉన్న చెడ్డను తొలగించుకోండి. శబరి గురువు గారికి చాలా సేవలు చేసింది. ఆయన వెళ్లిపోయేటప్పుడు

శబరితో నీవు నన్ను చాలా ప్రేమగా చూసావు, నేను వెళ్ళిపోతున్నాను అని చెప్పాడు. మీతోపాటు నేను కూడా వచ్చేస్తాను అని శబరి చెప్పింది. నేను వెళ్ళేచోటు ఇద్దరం కలిసి వెళ్ళేదికాదు, అక్కడకు ఏకాంతంగా వెళ్ళవలసిందే. నువ్వు నాకంటే అదృష్టవంతురాలివి. ఎందుకంటే నేను వెళ్ళి దేవుడిని వెతుక్కోవాలి కాని నువ్వు దేవుడిని వెతుక్కోనక్కరలేదు, ఈ శరీరం ఉండగానే, నువ్వు ఈ భూమి మీద ఉండగానే దేవుడు నిన్ను వెతుక్కొంటూ వస్తాడు అని గురువుగారు శబరితో చెప్పారు. శబరి యొక్క భాగ్యం అది. శబరికి సొంత దుఃఖం లేదు కానీ గృహపరిత్యాగం చేసింది. బుద్ధుడికి సొంత దుఃఖం లేదు కాని గృహపరిత్యాగం చేసాడు. వారు ఉత్తమోత్తములు, మహోన్నతులు. అప్పుడు అలా చేసాను లాభం వచ్చింది. ఇప్పుడు ఇలా చేసాను నష్టం వచ్చింది అనుకొంటే లోపల కర్తృత్వం ఉంది. కర్తృత్వం ఉన్నంతకాలం బంధం విడిచిపెట్టదు. బంధం పోకుండా మోక్షం రాదు. ఎక్కడైతే అజ్ఞానం ఉందో అక్కడ దుఃఖం వచ్చి తీరుతుంది. మీరు సాధన చేసేటప్పుడు ఒక్కటే గమ్యంగా పెట్టుకోండి. మనం రోజూ ఇల్లు ఎలా తుడుచుకొంటున్నామో అలాగ సాధన పేరు మీద లోపల ఉన్న అజ్ఞానాన్ని అంతా తుడుచుకోండి. అజ్ఞానం పోకుండా జ్ఞానం రాదు. భక్తివలన మన కోరికలు నెరవేరుతున్నాయా లేదా అనేది ముఖ్యం కాదు. భక్తిలో నీ మనస్సు కరగాలి. కారణం లేకుండా ఈశ్వరుని పాదాలమీద మీకు ప్రేమ కుదురుతూ ఉంటే, అకారణభక్తి కలుగుతూ ఉంటే మీ మనస్సు కరిగిపోతుంది. మనస్సు నశిస్తేనేగాని మన హృదయంలో ఉన్న శాంతి, ఆనందం మనకు అనుభవంలోనికి రాదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 2-11-08, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నేనుని పోగొట్టుకోమని భగవాన్ చెపుతున్నారు. ఓం నమో భగవతే శ్రీరమణాయ అనుకునేటప్పటికి నేనుని పోగొట్టుకోమనే మాట గుర్తుకు వస్తాంది, మరి నేనుపోతే ఎలాగ? నేను ఉండాలి కదా అని నాకు ఈ మధ్యన భయం కలుగుతోంది అని ఒక అమ్మగారు అడుగుతున్నారు. మీరు అడిగింది న్యాయమే. ఆ నేనును మీరు పోగొట్టుకోవద్దు. రాముడి దగ్గర ఆంజనేయస్వామి ఎలా సేవాభావంతోటి ఉన్నాడో అలాగే ఈ నేనును భగవంతుడికి సేవకుడు అనుకోండి. మీరు ఇంటి దగ్గర ఏ పని చేసినా అది భగవంతుడి పని అనుకొని చెయ్యండి అని నేను చెప్పాను. మీరు చెప్పింది బాగుంది. నేను రేపటినుంచి అలాగే చేస్తాను అని చెప్పారు. అహంకారం లేకుండా మనిషి ఉండడు. అహంకారం లేకపోతే వాడు భగవంతుడు

అయిపోతాడు. మనిషి పుణ్యం చేసినా, పాపం చేసినా అహంకారం కోసమే చేస్తాడు. మన హృదయంలో పరమాత్మ ఉన్నాడు. ఆయనకి శరీరం అక్కరలేదు. మనం నేను, నేను అంటున్నాము కదా. ఆ నేనుకి శరీరం కావాలి. మనిషి బతకటం కూడా ఆ నేను కోసమే బతుకుతాడు. మీ ఇంట్లో ఎవరైనా చనిపోతే ఆ నేనే ఏడుస్తుంది. మనం శాస్త్రం చదివితే ఆ నేను పోయినట్లు ఉంటుంది కాని ఇంకా బలపడుతుంది. ఆ నేను అనే తలంపే ముడి. ఆ ముడి తెగిపోకుండా ఎవరికీ బ్రహ్మజ్ఞానం కలుగదు. ఆ నేను ఉన్నంతసేపు పాతశవం పోతుంది. కొత్తశవం వచ్చేస్తూ ఉంటుంది. దానిని ఎవరూ ఆపుచేయలేరు. మనం శాస్త్రం చదివి ఆ నేనుని నువ్వు అబద్ధం కదా అని అడుగుతున్నాము. నేను నిజమే నువ్వు చదివిన పుస్తకం అబద్ధం అని అది చెబుతుంది. అదే మనం నిజం అనుకుంటున్నాము. మనం ఇలా అలవాటు పడిపోయాము. శాస్త్రంలో చెప్పిన మాటలు మనకు అనుభవంలో లేవు, ఈ నేను అనుభవంలో ఉంది కాబట్టి అది చెప్పింది నమ్ముతాము. శాస్త్రంలోనివి నమ్మం, నమ్మినట్లు నటిస్తాము. అనుభవంలో ఉన్న విషయం అనుభవంలో లేని విషయాన్ని గెంటేస్తుంది. మనం ఇంక గానుగెద్దులా వేసినచోటనే ఉంటాము. మన సాధనలు కూడా అంతే.

మనకి భగవంతుడి మీద గుణాలతో సంబంధం లేనటువంటి ప్రేమ ఉండాలి. మీ వాసనలతోటి, కోరికలుతోటి సంబంధం లేకుండా నూటికి నూరుపాళ్ళు మీకు భగవంతుడుపట్ల ప్రేమ కుదిరితే అప్పుడు మీకు ఆత్మజ్ఞానం వస్తుంది. మనకి గుణాలతో కూడిన ప్రేమలు ఉన్నాయి. సత్వగుణప్రేమ, రజోగుణప్రేమ, తమోగుణప్రేమ. గుణాలు మారేకొలది వాడి మనస్సు మారిపోతూ ఉంటుంది. సత్వగుణంలో ఉన్నప్పడు ప్రశాంతంగా మాట్లాడతాడు. రజోగుణంలో ఉన్నప్పడు చిరాకుగా, కోపంగా మాట్లాడుతాడు. తమోగుణంలో ఉన్నప్పడు మనం చెప్పింది అసలు వినిపించుకోడు. గురువు మీద ఉన్న ప్రేమ సత్వగుణప్రేమ అదీ ప్రేమేకాని అందులో గుణం ఉంది. మనకి గుణాలు లేని ప్రేమ రావాలి. పాల్‌బ్రంటన్ ఇంగ్లండు దేశస్థుడు. పెద్ద రచయిత. ఆయన 1936లో కంచి పరమాచార్యులు చెప్పగా భగవాన్ దగ్గరకు వచ్చారు. నేను అనే తలంపే జీవుడు, వాడే మనస్సు, ఆ తలంపు నీ లోపల నుంచే వస్తోంది. ఆ మూల తలంపు దాని మూలం చూడకుండా అది నశించదు అని భగవాన్ చెప్పారు. అది బ్రంటన్‌కి నచ్చింది. ఎ సెర్చ్ ఇన్ సీక్రట్ ఇండియా అనే బుక్కు ఇంగ్లీషులో వ్రాసాడు. అందులో 120 పేజీలు భగవాన్ గురించి వ్రాసాడు. ఆ పుస్తకానికి పెద్దపేరు వచ్చింది. ఆ పుస్తకం వ్రాయకముందు ఇతర దేశాలలో భగవాన్ గురించి ఎవరికి తెలియదు. ఆ పుస్తకం చాలామంది చదవటం

వలన రమణమహర్షి అరుణాచలంలో ఉన్నారని అందరికి తెలిసింది. ఆయన ఋషి అని తెలిసింది. హృదయంలో ఉన్న వస్తువుని ఉన్నది ఉన్నట్లుగా దర్శించినవాడు ఋషి. బ్రంటన్ భగవాన్ దగ్గరకి రెండవసారి వచ్చినప్పుడు భగవాన్ చెప్పింది ఆయన వ్రాసుకొంటున్నాడు. భగవాన్ తమ్ముడు చూసి అక్కడ ఉన్న ప్రొఫెసర్‌గారితో ఆయన వ్రాసుకోవటానికి వీల్లేదు కావాలంటే వినమనండి అని చెప్పారు. ఆదే ఆయన బ్రంటన్‌తో చెప్పారు. బ్రంటన్ స్టన్ అయిపోయాడు. బ్రంటన్ భగవాన్ వైపు తిరిగి మీ తమ్ముడు వ్రాసుకోవద్దన్నాడు మీ ఉద్దేశ్యం కూడా అదేనా అని అడిగాడు. భగవాన్ ఏమి చెప్పకుండా మౌనంగా ఉండిపోయారు. ఈ ఆశ్రమం ఇలాగ ఉందేమిటి అని మరుసటిరోజు ఆశ్రమం వదిలి వెళ్ళిపోయాడు. భగవాన్ మీద అంతకు ముందు ఉన్న గౌరవం కంప్లీట్‌గా పోయింది. ఇది సత్వగుణప్రేమ. బ్రంటన్ అంతటివాడికే బుద్ధిమారిపోయింది. ఆయన గురువును ప్రేమించిన మాట నిజమే కాని ఆయన మనస్సుకు ఇష్టంలేని సంఘటన జరిగింది సడన్‌గా ఆ ప్రేమ అంతా ద్వేషంగా మారిపోయింది. గుణంతో కూడిన ప్రేమను నమ్మటానికి వీలులేదు. ఈ మూడు గుణాలు దాటిన ప్రేమ చిరకాలం, కలకాలం ఉంటుంది. భార్యభర్తల మధ్య ఉన్న ప్రేమ రజోగుణప్రేమ. పెళ్ళి అయిన కొత్తలో ఉన్న ప్రేమ ముసలివాళ్ళు అయిన తరువాత ఉండదు. ఒకరిని ఒకరు తిట్టుకుంటూ ఉంటారు. ఇది నూటికి నూరుపాళ్ళు అబద్ధం. మీ ఇంట్లో పనిమనిషి అమ్మగారు, అమ్మగారు అంటుంది. మీరు ఎప్పుడైనా చిరాకుపడి నాలుగు నెలలు జీతం ఇవ్వకపోతే మిమ్మల్ని తిడుతుంది. ఇది తమోగుణ ప్రేమ. ఇవి అన్నీ మీ అనుభవంలో తెలుస్తూ ఉంటాయి, మీకు ఆత్మజ్ఞానం కలిగింది అనుకోండి వాడు పెద్దవాడా, చిన్నవాడా, మంచివాడా, చెడ్డవాడా అని ఈ కొలతలు లేకుండా సమానమైన ప్రేమ నిలబడుతుంది. ఇది ఆత్మ ప్రేమ. నిజమైన ప్రేమ ఆత్మలోంచి ప్రవహిస్తుంది.

సహనం ఉన్న మనిషికి గుండె యొక్క లోతులు పెరుగుతాయి. మన గుండె యొక్క లోతులు పెరగటం గెడ్డపార పెట్టి గొయ్యి తీసినంత తేలికకాదు. మనకి ఆత్మజ్ఞానం కలగాలంటే ప్రవర్తన సరిగా ఉండాలి. నీకు ఎవరైనా అధర్మం చేసినా నువ్వు ధర్మాన్ని విడిచిపెట్టకు. భగవంతుడిని తెలుసుకోవటానికి పనికి వచ్చే గ్రంథాలు చదువు. మంచి గ్రంథం చదవటం వలన ఎలా బాగుపడతామో, చెడ్డ గ్రంథం చదవటం వలన అలా పాడైపోతాము. నువ్వు గ్రంథం చదివి అర్థం చేసుకొని దానిని ఎంజాయ్ చేస్తూ అది ఇతరులకు చెప్పటం వలన నీకు లాభం ఏమిటి అంటే, ఈ రోజు నాలుగు మంచి మాటలు చెప్పాను ఇవన్నీ చిలకపలుకులా లేకపోతే ఇందులో ఒక్కమాటైనా అనుభవంలో ఉందా అని ఇంటికి వెళ్ళిన తరువాత నీకు

ఆలోచన వస్తుంది. అనుభవంలో లేనివి నీ మనస్సు చెబుతుంది. అప్పుడు వాటిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చేస్తావు. అది చెప్పేవాడికి లాభం, విన్నవాళ్ళకి విన్నది లాభం. అంతా ఈశ్వరసంకల్పంతోటి నడుస్తోంది అంటున్నారు కదా? చదవటానికి బాగానే ఉందికాని దాని గురించి తెలియటంలేదేమిటి అని అడుగుతున్నారు. అది తెలియటానికి వంద జన్మలు సాధన చేస్తేకాని తెలియదు. ఆ వాక్యము నీకు అనుభవంలోనికి వస్తే బండెడు దుఃఖము ఉంటే బండెడు సుఖం క్రింద మారిపోతుంది. మీ ఋణం తీరటమేకాదు మళ్ళీ నిలవ క్రింద మారిపోతుంది. మీకు ఆత్మ ప్రేమ ఉంటే మీ తల్లిదండ్రులు చెడ్డవారైనా వారిని ప్రేమించటం మానరు. వారు చెడ్డవాళ్ళయితే మీకెందుకు, మీకు శరీరం ఇచ్చారు అందుకు వారిని ప్రేమించాలి, వారు చెడ్డవాళ్ళయితే భగవంతుడు చూసుకొంటాడు. మీకు ఆత్మ ప్రేమ లేదనుకోండి వారిని ప్రేమించటం మానేయటం కోసం ఏదో వంపు పెట్టుకొంటారు ఇది మాయ. ఎవరైనా చెడ్డవాళ్ళయితే వాళ్ళని మనం చెడ్డవాళ్ళు అంటాము కాని జ్ఞాని అలాగ అనడు. ఆ చెడ్డవాడిని మంచివాడి కింద మార్చి వాడికి ఆత్మజ్ఞానం ఎలాగ ఇవ్వాలి అని చూస్తాడు. అది జ్ఞాని యొక్క వైభవం. అది గుణాలు లేని ప్రేమ.

మనిషి తన స్వభావాన్ని మార్చుకోవటం చాలా కష్టం అని పరమాత్మ గీతలో చెప్పాడు. నువ్వు బ్రతికి ఉండగా కాలిపోయి మళ్ళీ ఆ శరీరంలో పుడితే స్వభావం మారుతుంది. స్వభావం మార్చుకోవటం అంత కష్టం. నీ చదువుల వల్ల, నీ డబ్బు వల్ల స్వభావం మార్చుకోగలవా? ఎంతో కష్టపడి సాధన చేసినా స్వభావం మారుతుందని చెప్పలేము. మీ మీద మీరు యుద్ధం ప్రకటించుకుంటె అప్పుడు స్వభావం మారుతుంది. మీరు స్వభావంలో మార్పు తెచ్చుకొంటే మీకు జ్ఞాననేత్రం కలుగుతుంది. బ్రాహ్మీస్థితి పొందటానికి దారి కనిపిస్తుంది. ఒక నది ఒడ్డున తేలు ఆవలి గట్టుకు వెళ్ళటానికి ఆలోచిస్తోంది. అంతలో ఒక తాబేలు ఒడ్డుకి వచ్చింది. ఓ తాబేలా! నేను ఈ నది ఆవలి ప్రక్కకు వెళ్ళాలి అనుకొంటున్నాను. నాకు ఈతరాదు. నువ్వు నాకు ఒక సహాయం చేయాలి. నేను నీ వీపుమీద కూర్చొంటాను నన్ను ఆ ప్రక్కన పెట్టేయి వెళ్ళిపోతాను అంది. నీ స్వభావం నాకు తెలుసు నీకు కుట్టే అలవాటు ఉంది నేను తీసుకొని వెళ్ళను అని తాబేలు అంది. నువ్వు నాకు ఉపకారం చేస్తున్నావు నిన్ను ఎందుకు కుడతాను అని తేలు చెప్పింది. తాబేలు తేలు మాటలు నమ్మి అయితే నా వీపు మీద కూర్చో ఆ ప్రక్కన దింపేస్తాను అంది. తేలు వీపు మీద కూర్చుంది, తాబేలు తీసుకువెడుతోంది. నది మధ్యలోకి వెళ్ళాక తేలుకు కుట్టాలనే బుద్ధి వచ్చేస్తోంది. మనం మాట ఇచ్చాము పైగా మనకి

ఉపకారం చేస్తోంది కుట్టకూడదు అనుకొంది అయినా కుట్టాలనిపిస్తోంది. అంతే కుట్టేసింది. అలవాట్ల యొక్క వేగం అటువంటిది. తాబేలు ఆ మంట భరించలేక తలకాయ నీటిలో పెట్టి కుదిపేసుకొంది, పైనున్న తేలు నీటిలో పడి కొట్టుకుపోతోంది. ఓ తేలా! నువ్వు నాకు ఇచ్చిన మాట ఏమిటి? నువ్వు చేసినదేమిటి? అని తాబేలు అడిగింది. ఓ తాబేలా నువ్వు చెప్పింది న్యాయముగానే ఉంది. కుట్టటం నా పొరపాటు, నీకు ఇచ్చిన మాట పోషించుకోలేకపోయాను అని తెలుస్తోంది నిన్ను కుట్టటం వలన నాకే నష్టం వచ్చింది కదా, అయినా కుట్టాలనే తలంపును జయించలేకపోయాను, ఇప్పుడు నేను కొట్టుకొనిపోతున్నాను నా స్వభావం ముందు ఆ లాజిక్ ఏం చేస్తుంది అని చెప్పింది. మాటల కంటే అలవాట్లే ఎక్కువ వేగంగా పనిచేస్తాయి. మీ ముక్కులో గాలి బయటకు పోయేవరకు ఈ కథ జ్ఞాపకం పెట్టుకోవాలి. రకరకాల మనుష్యులు ఉంటారు. మీరు ఎవరికైనా వంద ఉపకారాలు చెయ్యండి కాని వాడు మీకు అపకారం చేయటం మానడు. మీరు ఉపకారం చేస్తున్నట్లు వాడికి తెలుస్తూ ఉంటుంది కాని అపకారం చెయ్యకుండ విడిచిపెట్టడు. అది వాడి స్వభావం. వాడు ఆ అలవాటుతో జన్మించాడు, అలవాటుతో ఉంటాడు, అలవాటుతో మరణిస్తాడు. మీరు ఇంటి దగ్గర కూర్చుని అధ్యయనం చేయటం వలన స్వభావం మారదు. నీతో నువ్వు పోరాడితే స్వభావం మారుతుంది కాని ఇతరులతో పోరాడితే స్వభావం మారదు.

మనకి దేహంతోటి, మనస్సుతోటి ఎంతకాలమైతే తాదాత్మ్యం ఉందో అంతకాలం లోపలఉన్న సత్యం మనకి ఎరుకలోనికి రాదు. సత్పురుషుల సహవాసం, సద్గ్రంథపఠనం, తీర్థయాత్రలు వీటన్నిటియొక్క ప్రయోజనం ఏమిటి అంటే మనస్సుని అంతర్ముఖం చేయటమే. మనస్సు అంతర్ముఖం అవ్వకపోతే ఆత్మజ్ఞానం కలగదు, ఆత్మజ్ఞానం కలగకపోతే వాడికి మోక్షం లేదు. మీకు మంచి పని చేసే శక్తి ఉంటే చెయ్యండి, చేసే శక్తి మీకు లేకపోతే చేసేవాళ్లని చూసి సంతోషించండి. పనిచేసి ఫలితం ఎపుడు వస్తుందని కనిపెట్టుకొని ఉంటే మన బుద్ధి పాడైపోతుంది. సత్కర్మ నిష్కామంగా చెయ్యాలి. సత్కర్మ చేస్తూ ఉండాలి, కోరిక ఉండకూడదు. అప్పుడు చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి లేకుండా ప్రపంచంలో ఇంతవరకూ ఎవరికి జ్ఞానం కలుగలేదు. లోపల ఉన్న వస్తువు ఎంత శుద్ధంగా ఉందో మన మనస్సు కూడా అంత పరిశుద్ధమైతేనే గాని అది మనకు తెలియబడదు. ఈలోపుగా తెలియబడిన మనం భరించలేము. బ్రహ్మం నీలోపలే ఉంది దానిని తెలుసుకోవటానికి తగిన అర్హత, యోగ్యత నీకు ఉన్నాయా అని చూసుకొంటోంది. ఆ అర్హత, యోగ్యత నీకు వచ్చినప్పుడు ఒక్కక్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా

అది నీకు తెలియబడుతుంది.

నేను సృష్టికి ఉపకారం చెయ్యాలనుకొంటున్నాను అని ఒకరు భగవాన్‌ని అడిగితే ముందు నువ్వు ఆత్మజ్ఞానం సంపాదించు అపుడు నీ ద్వారా సృష్టికి ఉపకారం జరుగుతుంది. దానికి మించిన ఉపకారం లేదు అన్నారు. జ్ఞానం వల్ల వచ్చే సుఖంగాని, శాంతిగాని, ఆనందంగాని ఈ లోకవిషయాలతోటి పోల్చటానికి వీలులేదు. మనకి కుంటితనం ఉంటే ఆ కుంటితనం ఎలా అవకరమో అలాగే ఈ మనస్సు అనేది ఒక అవకరం. ఈ అవకరం వదిలించుకొనేదాకా మనకి ఆత్మజ్ఞానం కలుగదు. మనస్సుని నాశనం చేసుకోవటం ఎలాగ, అక్కడే భయమేస్తోంది అని అడుగుతున్నారు. మనస్సే నువ్వు అనుకోవటం వలన దానిని తొలిగించుకోమంటే నీకు భయమేస్తుంది. నీకు జాగ్రదావస్థలో, స్వప్నావస్థలో మనస్సు ఉంది. కాని గాఢనిద్రలో మనస్సు గొడవ లేదు. మనస్సే నిజమైతే గాఢనిద్రలో అది ఎందుకు లేదు. మనకి గాఢనిద్ర గురువు. గాఢనిద్రలో చావుగొడవ, పుట్టుకగొడవ, దేహంగొడవ, మనస్సు గొడవ లేదు కాని మనం ఉన్నాము. గాఢనిద్రలో దుఃఖ స్పర్శ లేకుండా మనం సుఖంగా ఉన్నాము. ఆ స్థితిని జాగ్రదావస్థలో మనం ఎరుకలోనికి తెచ్చుకోవాలి. మనస్సుకి చాపల్యం ఎక్కువ. మనలని జపం ఎందుకు చెయ్యమన్నారంటే మన ఇష్టదైవం యొక్క నామాన్ని నిరంతరం జపిస్తూ ఉంటే మనస్సుకి చాపల్యం తగ్గుతుంది. దానికి లోచూపు కలుగుతుంది, లోచూపు కలిగాక జ్ఞానసముపార్జనపట్ల ఇష్టం కలుగుతుంది అందుకు జపం చెయ్యమన్నారు. ఇతరులు మిమ్మల్ని పొగిడితే అది లోపలకు తీసుకుంటె అది అంతా దుఃఖంకింద మారిపోతుంది. మిమ్మల్ని మీరు పొగుడుకోవటం ఎంత పొరపాటో, ఇతరులు మిమ్మల్ని పొగుడుతూ ఉంటే శ్రద్ధగా వినటం కూడా అంతే పొరపాటు. ఇతరులు పొగిడితే అది కీర్తి. జ్ఞానం లేనప్పుడు కీర్తి ఏమి చేసుకొంటాము. మీరు ఏదో ఒక రంగంలో అభివృద్ధిలోకి వస్తున్నారు అనుకోండి అలా అభివృద్ధిలోనికి రావటం సంఘం ఒప్పకోదు అది మాయ. మీ కాళ్ళు పట్టుకొని లాగేయటానికి చూస్తారు. అప్పడు తట్టుకోవాలి, సంఘం ఇలా అణిచేస్తోందని సంఘం మీద ద్వేషం పెట్టుకోకూడదు. ఇవన్నీ మీరు తట్టుకోగల్గితే ఆత్మజ్ఞానానికి అర్హత సంపాదిస్తారు.

నువ్వు ధర్మబద్ధమైన జీవితం జీవించటం కోసం భగవంతుడి పాదాలు ఆశ్రయించు. శాస్త్రాన్ని పట్టుకొని ఉండు, నీ అహంకారం ఎలా చెబితే అలా గంతులెయ్యకు. నీకు అవకాశం ఉన్నంత వరకు ధర్మాన్ని ఆచరించు. నీ కుటుంబ సభ్యులుకాని, నువ్వు సంపాదించిన డబ్బుకాని

నువ్వు మరణించిన తరువాత నీ కూడా రాదు. మరణించిన తరువాత నీ కూడా ధర్మం వస్తుంది. మౌనం అంటే భగవాన్‌కు ఇష్టం. మౌనం కూడా మాట్లాడుతుంది అనేవారు. మాట చెప్పాలంటే మనకి నోరు ఉండాలి. మౌనానికి నోరు అక్కర్లేదు. మనస్సుకి చాపల్యం ఆగిపోగానే అది హృదయంలో అణిగిపోతుంది. అక్కడ మౌనస్థితి కలుగుతుంది. ఆ మౌనం మీ హృదయానికి చెప్పవలసిన సందేశం చెప్తుంది. అక్కడ మాటలు ఉండవు. హృదయం హృదయంతోటి మాట్లాడేటప్పుడు మాటలతో పని ఏముంది? సైగలతోటి పని ఏముంది అన్నారు భగవాన్. అది మౌన భాష. మీరు ఇక్కడ ఉండి అమెరికాలో ఉన్నవారి క్షేమం కోరుకుంటున్నారనుకోండి ఆ తలంపుకి దూరంలేదు, ఆ తలంపు అమెరికాలో కూడా పని చేస్తుంది. మంచి తలంపుకే అంత శక్తి ఉన్నప్పుడు ఆత్మశక్తి ఇంక ఎంత బలీయమైనది. మీరు జ్ఞాని దగ్గర కూర్చున్నప్పుడు మీ కష్టాలు మర్చిపోయి శాంతిగా ఉంటారు. జ్ఞానియొక్క మాటలు కంటే ఆయన మౌనం మీ మనస్సులో తొందరగా మార్పు తీసుకువస్తుంది. మీకు మారుమనస్సు కలుగుతుంది. ఉపయోగంలేని అలవాట్లు ఉంటే వాటిని తొలగించి ఉపయోగపడే అలవాట్లు తీసుకువచ్చేది జ్ఞాని యొక్క మౌనం.

కోరికను ఎక్కువసార్లు నెరవేర్చుకొంటూ ఉంటే దానిని అలవాటు అంటారు. ఆ అలవాట్లు బలపడిపోతూ ఉంటే వాటిలోంచి వాసనలు వస్తాయి. ఈ వాసనలు మనస్సుని పట్టుకొని మన శరీరం చనిపోయిన తరువాత కూడా వచ్చేసి కొత్త శరీరంలో ప్రవేశిస్తాయి. భౌతిక పదార్థాలు ఏమీ మనకూడా రావు. ఆ మనస్సనే జీవుడు అంటాము. ఆ జీవుడిని శరీరం వదిలి బయటకు వెళ్ళమంటే వెళ్ళడు. ఆ శరీరంలో ఎన్ని అనుభవాలు పొందాలో అన్ని అనుభవాలు పొందితేగాని ఆ శరీరాన్ని, జీవుడిని సెపరేట్ చెయ్యలేము. భగవంతుడు ఆ ముక్కులో గాలిపోసినప్పడే మరల ఆ ముక్కులో గాలి ఎప్పడు తీసివేయాలో నిర్ణయిస్తాడు. మనం ఎక్కువకాలం బతకాలని అనుకొన్నా ఒక గంటకాలం ఎక్కువ బతకము, చావు ఎప్పడు వస్తుందా అని కనిపెట్టుకొని ఉంటే ఒక గంటముందు వెళ్ళము. మన వల్ల ఏమీ అవ్వదు. భగవాన్‌ని చూడటానికి రాధాకృష్ణన్‌గారు వచ్చేవారు. ఆయన మహా పండితుడు. భగవాన్‌ని ఆయన ఎప్పడూ ఒక్క ప్రశ్న అడగలేదు. మిమ్మల్ని చూడటానికి వస్తున్నారు మిమ్మల్ని ఏమీ అడగకుండా వెళ్ళిపోతున్నారు ఏమిటి అని భగవాన్‌ని అడిగితే ఆయనకు అన్నీ తెలుసు, తెలుసున్నవాడు ఏమి అడుగుతాడు అన్నారు. భగవాన్ గురించి మీ అభిప్రాయం ఏమిటి అని రాధాకృష్ణన్‌గారిని అడిగితే ఆయన లైట్‌హౌస్ అన్నారు. సముద్రంలో ఉన్న

ఓడలకు ఇది ఒడ్డు అని తెలియటం కోసం లైటుహౌస్ ఎలా ఉపయోగపడుతుందో అలాగ బ్రాహ్మీస్థితిని పొందినవాడు ఎలాగ ఉంటాడో తెలియటం కోసం ఆయన మనకు ఉపయోగపడుతున్నారు అని రాధాకృష్ణన్ చెప్పారు. భౌతికమైన ఉపకారం మంచిదేగాని అవి తాత్కాలికాలు. మన మనస్సు ఎంత నిజమో ఆ ఉపకారాలు కూడా అంతే నిజం. నీ లోపలున్న సద్వస్తువు అనుభవంలోనికి తెచ్చుకుంటే నీ ద్వారా వేలాది మంది బాగుపడతారు. దానికి మించిన ఉపకారం లేదు. చేతిలో డబ్బు ఉంటే బజారులో ఉన్న వస్తువు కొనుక్కోవటం ఎంత తేలికో మన స్వభావాన్ని, అలవాట్లని మార్చుకోకల్గితే ఆత్మజ్ఞానసముపార్జన కూడా అంతే తేలిక. మనకి ఆత్మజ్ఞానం కలిగేవరకూ దేహము నేను అనే బుద్ధిలోనుండి బయటకు రాలేము. భగవంతుడు ఏమి చేస్తాడు అంటే దూడని కట్రాడుకి ఎలా కట్టేస్తామో అలాగ ప్రతీ జన్మలో ఏదొక శరీరానికి మనలను కట్టేస్తూ ఉంటాడు. ఆ శరీరానికి మంచి జరిగితే మంచని, చెడ్డ జరిగితే చెడ్డని ఇలా జీవిస్తూ ఏదొక రోజున చనిపోతాము. ఎన్ని గ్రంధాలు చదివినా దేహము నేను అనే తలంపులోనుండి బయటకు రాలేకపోతున్నాము. ఈ మాయలోనుండి బయటకు రావటం చాలా కష్టం. దైవానుగ్రహం ఉన్నవాడు కాని ఇందులోనుండి బయటకు రాలేడు. అంతవరకు మనకి తేలు బుద్ధిపోదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-7-08, తాడేపల్లిగూడెం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సాధారణంగా మనలో ఆలోచన తక్కువగా ఉంటుంది, అనుకరణ ఎక్కువగా ఉంటుంది. పదిమంది ఏ పని చేస్తే ఆ పని చేస్తూ ఉంటాము, సొంత ఆలోచన ఉన్నవారు చాలా తక్కువగా ఉంటారు. మనుషులు అందరూ గొఱ్ఱెల వంటివారు అని బుద్ధుడు అన్నాడు. ఒకసారి గొఱ్ఱెల మంద వెళుతోంది, ఎదురుగా పెద్ద గొయ్యి ఉంది. ముందుగా వెళ్ళే గొఱ్ఱె చూసుకోకుండా వెళ్ళి ఆ గొయ్యిలో పడిపోయింది. అది ప్రమాదవశాత్తు గోతిలో పడిపోయింది అని మిగతా గొఱ్ఱెలకు అర్థంకాలేదు. అక్కడ ఏదో మేత ఉంది, తినటానికి వెళ్ళిపోయింది, మనం కూడా తినేద్దాము అని మిగిలిన గొఱ్ఱెలు కూడా వెళ్ళి ఆ గోతిలో పడిపోయినాయి. మన పరిస్థితి కూడా అలాగే ఉంది. ఎవరో వస్తున్నారు అనుకోండి. అందరు ఎందుకు అలా గెంటుకొని రావటం. మీకు వినబడటం లేదు అనుకోండి, వినపడటం లేదు అని చెప్పవచ్చు. ఎక్కడ కూర్చొన్నా ఒక్కటే. గురువు దగ్గరకాని, ఈశ్వరుడి దగ్గర కాని బలవంతాన ఎవరూ మోక్షం పుచ్చుకోలేరు.

మంచితనానికి, వినయానికి, సహృదయానికి ఈశ్వరుడు లొంగుతాడు కాని బాహ్యపరిస్థితులకు దేనికీ ఆయన లొంగడు. డిమాండ్ చేస్తే మనకు మోక్షం రాదు, వెనక్కి వెళుతుంది. ఉపనిషత్‌లలో ఏమని ఉంది అంటే మోక్షం కోరుకొనేవారికి భగవంతుడు మోక్షం ఇవ్వడు, ఆయన ఎవరికి ఇవ్వాలంటే వారికే ఇస్తాడు. మనకు యోగ్యత ఉంటే, అర్హత ఉంటే మన కోరికతో సంబంధం లేకుండా ఆత్మజ్ఞానంతోటి అనుగ్రహిస్తాడు. నేను ఇలా వస్తూ ఉంటే నాకు ఎవరో ఒకరు పండు ఇస్తారు. ప్రక్కన నలుగురు ఇలా చెయ్యి చాపుతారు. పండు నేను ఇస్తే పుచ్చుకోవాలి అలా చెయ్యి చాపకూడదు. చెయ్యి చాపకపోయినా ఇస్తాను ఈ లోపుగా కంగారుపడిపోయి చెయ్యి చాపేస్తారు. ఈ చిన్న విషయం కూడా మీకు తెలియకపోతే మీకు ఆత్మజ్ఞానం ఏమిటి? మేము ఏదైనా పండు ఇస్తే ప్రసాదం కింద మీరు తీసుకోవచ్చు అంతేగాని ఎవరో నా చేతిలో పండు పెడితే పక్కన పదిమంది ఇలా చేతులు పెట్టటం ఏమిటి? అంటే క్రమశిక్షణ లేకపోవటం. క్రమశిక్షణ లేకుండా మనం భౌతికంగా కాని, ఆధ్యాత్మికంగా కాని అభివృద్ధిలోనికి రాలేము. ఒకవేళ క్రమశిక్షణ లేకుండా అభివృద్ధిలోనికి వచ్చినా పునాది లేని ఇల్లు ఎలా ఉంటుందో క్రమశిక్షణ లేకుండా అభివృద్ధిలోనికి వచ్చినా అలాగే ఉంటుంది, అది నిలబడదు కూలిపోతుంది.

మీరు సబ్జక్టును బాగా శ్రవణం చేయాలి, తరువాత దానిని మననం చేయాలి. అలా మననం చేస్తేనేగాని అది మీకు అర్థం కాదు. సబ్జక్టును ప్రోపర్‌గా అర్థం చేసుకోవటం కూడా యోగంతో సమానం. మీరు ఏదైనా చెవితో విన్నప్పుడు ఈ వాక్యం మనకు ఎంత వరకు ఉపయోగపడుతుంది అని జాగ్రత్తగా చూసుకోవాలి. మీకు అవసరం అయిన వాక్యాలను హృదయంలోనికి తీసుకోవాలి. అవసరం లేని మాటలను వదిలేయాలి. మనం భగవంతుడు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకోవాలి. ఎవరు ఏది చెప్పినా అది శాస్త్రానికి, భగవంతుడు చెప్పిన వాక్యానికీ అనుకూలంగా ఉందా లేదా అని జాగ్రత్తగా పరిశీలన చేసుకోవాలి. బ్రహ్మం మన హృదయంలో ఉంది, దాని స్వరూపం సుఖం, దాని స్వరూపం శాంతి, దాని స్వరూపం ఆనందం, దాని స్వరూపం ఉండటం సబ్జక్టు ఉన్నది ఉన్నట్లుగా ప్రోపర్‌గా మనకు అర్థం కావటం లేదు కాబట్టి, మన మనస్సుకు ఏదో సపోర్టు ఉండాలి కాబట్టి మతాలు అన్నీ ఒక దేవుడిని తీసుకొని వచ్చి అక్కడ పెట్టాయి అని ఐన్‌స్టీన్ చెప్పాడు. మీకు శరీరంలో ఏ రోగం లేనప్పుడు డాక్టరు ఎలా జ్ఞాపకం రాడో, ఆలాగే మీలో ఏ రకమైన బలహీనతలు లేనప్పుడు దేవుడు కూడా జ్ఞాపకం రాడు అన్నాడు ఐన్‌స్టీన్. మనం ప్రతీ చిన్న విషయానికి భయపడిపోతూ ఉంటే ఇంక

ఆలోచన పెరగదు. భయం వలన అశాంతి వస్తుంది, దుఃఖం వస్తుంది. దేహము నేను అనే తలంపు ఉన్నంతకాలం ఎవడినీ భయం విడిచిపెట్టదు. ఒక్క జ్ఞానిని తప్పించి మిగతా వాళ్ళందరినీ భయం వెంటాడుతుంది. మీరు వేరు, నేను వేరు అనే ద్వైతబుద్ధి ఉన్నంతకాలం వాడు ఎంతటివాడైనా వాడిని భయం వెంటాడుతూనే ఉంటుంది. ద్వితీయం ఎలా ఉంటుందో తెలియనివాడే, బ్రహ్మానుభవం పొందినవాడే భయరహితంగా ఉండగలడు. లోపల దేహాభిమానం పెట్టుకొని నేను భయరహితంగా ఉన్నాను అని ఎవడైనా చెపితే వాడు నూటికి నూరుపాళ్ళు అబద్ధాలకోరు.

మనం ఎంతవరకు అవసరమో అంతవరకే మాట్లాడాలి కాని అవసరానికి మించి మాట్లాడుతున్నాము అనుకోండి మనస్సుకు చాపల్యం వచ్చేస్తుంది, వికారాలు వచ్చేస్తాయి, ఇంక మీరు దానిని కంట్రోలు చేసుకోలేరు. నువ్వు ఏవైనా మంచి పనులు చేస్తున్నావు అనుకో ఏదో స్వర్గలోకం కోరి ఆ పనులు చేయకు, నీ హృదయంలో ఉన్న సద్వస్తువు యొక్క దయను సంపాదించటానికే ఆ పనులు చెయ్యి. ఈ లోకంలో అనేక భోగాలు ఉన్నాయి, మీరు పురాణాలు చదివితే పరలోకంలో ఉన్న భోగాల గురించి చెపుతారు. ఈ లోకంలో ఉన్న భోగాల మీదకుగాని, పరలోకంలో ఉన్న భోగాల మీదకు గాని మీ మనస్సు చిందుతూ ఉంటే, మీ మనస్సు రవ్వంత అటు జరుగుతున్నప్పటికీ మీ మనస్సు బాహ్యాముఖమవుతుంది గాని అంతర్ముఖం అవ్వదు, మీరు ఎంత ప్రయత్నం చేసినా మీకు ఆత్మజ్ఞానం కలుగదు. నిష్కామ భక్తి వలన, నిష్కామ ప్రేమ వలన మోక్షం వస్తుంది కాని ఏవో కోరికలు పెట్టుకొని భగవంతుడిని ప్రార్థించటం వలన కోరికలు నెరవేరవచ్చుకాని అసలు వస్తువు దొరకదు. నిజం మీకు అనుభవంలోనికి వచ్చేవరకు నిజం కానిదానిని నిజం అనుకొంటూనే ఉంటాము. ఇలా కోట్లాది జన్మలు ఈ ప్రవాహంలో కొట్టుకొనిపోతాము. త్యాగి కానివాడు జ్ఞాని కాలేడు. త్యాగం అంటే ఏవో బాహ్యాంగా ఉన్న వస్తువులను దానం చేయటంకాదు, ఇవన్నీ సెకండరీ, వీటి వలన పుణ్యం రావచ్చు. దేహాభిమానాన్ని, జీవలక్షణాలను ఎవడైతే త్యాగం చేస్తున్నాడో వాడినే జ్ఞానం వరిస్తుంది. మాయ మనలను ఆడిస్తూ ఉంటుంది. మాయ ఈశ్వరుడి కంట్రోలులో ఉంది. మనం ఈశ్వరుడి పాదాలను ఆశ్రయిస్తే, ఆయన చెప్పిన ప్రకారం మనం జీవిస్తూ ఉంటే మాయను మనకు దారి ఇమ్మని ఆయన చెపుతాడు, అప్పడు మనం హృదయగుహలో పడిపోతాము. అప్పడు సుఖం, శాంతి, ఆనందం మనకు స్వరూపంగా వ్యక్తమవుతాయి. ఆ స్థితిని పొందేవరకు ఏ మనిషిని దుఃఖం విడిచిపెట్టదు, అశాంతి

విడిచిపెట్టదు, ప్రకృతి విడిచిపెట్టదు, సంసారం విడిచిపెట్టదు, ఇందులో రాజీ లేదు.

నీకు సుఖం కావాలంటే, శాంతి కావాలంటే బయట ఎక్కడా లేదు, నీ హృదయంలోనే ఉంది. నువ్వు ఏ పని చేసినా, ఏది మాట్లాడినా అక్కడ గురిపెట్టు. అధికారం, డబ్బు, పాండిత్యం వీటి వలన మనకు తెలియకుండా మత్తు వస్తుంది. మనకు ఎంత వరకు అవసరమో అంతకు మించి మనకు ఉన్నవి అన్నీ లగ్జరీతోటి సమానము. మనకు పది చీరలు సరిపోతాయి అనుకోండి, వంద చీరలు పెట్టుకొంటే అది ఒక లగ్జరీ. నేను పది మాటలలో ఒక సబ్జక్టు మీకు చెప్పగలను అనుకోండి, దానికి వంద మాటలు వాడుతూ ఉంటే అది ఒకరకమైన లగ్జరీ. కొంతమందికి డబ్బు ఉంటుంది, మంచి పనులకు ఉపయోగించరు, విచ్చలవిడిగా చెడ్డ పనులకు ఖర్చుపెడతారు, అది కూడా ఒకరకమైన లగ్జరీ. పైకి మన పని మనం చేస్తున్నప్పటికీ లోపల వైరాగ్యంగా ఉండాలి. లోపల వైరాగ్యంగా ఉంటే మనం చేసే పని బాగా చేయగలము, నిర్మలంగా చేయగలము, నిశ్చలంగా చేయగలము. అభయం, అసంగం. మనం భయం తగ్గించుకొంటూ ఉండాలి. మన పని మనం చేసుకొంటూ ఉండాలి. గుర్తింపులు కోరుకోకూడదు. గుర్తింపులు కోరుకొంటే దేహాభిమానం పెరుగుతుంది. నీ డ్యూటీ నువ్వు నిర్మలంగా చేసుకొంటూ వెళ్ళు. ఫలితం మీద ఆసక్తి పెట్టుకోవద్దు. అసంగంగా ఉండు, ఎక్కడా బంధం పెట్టుకోవద్దు. నిష్కామకర్మ, నిష్కామభక్తి ఇవి అన్నీ తపస్సుతోటి సమానము. జీవితంలో జరిగే సంఘటనల నుండి పాఠాలు నేర్చుకోండి. బయటపుస్తకాలు వేసుకొని తిరగటం కాదు మీ హృదయం అనే పుస్తకాన్ని చదవండి. హృదయం అనే పుస్తకాన్ని చదివితే హృదయంలో ఏముందో మీకు తెలుస్తూ ఉంటుంది. అదే నిజమైన సాధన. మీకు బ్రాహ్మీస్థితి కలగకుండా ఏవైతే అడ్డు వస్తున్నాయో చూసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయండి. బ్రాహ్మీస్థితి పొందటానికి ఒక అవకాశాన్ని భగవంతుడు మనకు ఇచ్చాడు. ఈ అవకాశాన్ని ఎవడైతే మేగ్జిమమ్ ఉపయోగించుకొంటాడో వాడు ఇప్పుడే, ఇక్కడే, ఈ శరీరం ఉండగానే ఆ స్థితిని పొందవచ్చు.

మీరు ధర్మాన్ని ఆచరించండి, ధర్మబద్ధంగా ఎంతవరకు సంపాదించగలరో అంతవరకు సంపాదించుకోండి, మీరు సంపాదించిన డబ్బు మీకు భోగం పెంచకూడదు, ధర్మబద్ధంగా సంపాదించిన దానిని సద్వినియోగం చేయండి. మీ ఇంట్లో ముసలివారు ఉంటే వారికి సేవ చేయండి. మీరు వంతులు వేసుకోవద్దు. వారు చూడటం లేదు మేము ఎందుకు చూడాలి అని అనుకోవద్దు. మీకు అవకాశం వచ్చింది, పట్టుకోండి. అప్పుడు దేవుని దయ

మీ మీద వర్షిస్తుంది. భగవంతుడు మనకు ఒక అవకాశం ఇచ్చాడు అనుకొని మీరు పనిచేస్తే దాని వలన మీరు పవిత్రులు అవుతారు, పవిత్రుడు మాత్రమే ఆత్మజ్ఞానికి వారసుడు అవుతాడు. మీకు ఇవ్వగలిగే శక్తి ఉంటే ఇస్తూ ఉండండి. మీ దగ్గర ఎవరైతే తీసుకొంటున్నారో వారు తక్కువ వారు అని, మీరు ఎక్కువ వారు అని అనుకోవద్దు. భగవంతుడు మనకు ఇచ్చే అవకాశం ఇచ్చాడు అనుకొని మీకు ఉన్న ధనాన్నిగాని, తెలివినిగాని సద్వినియోగం చేసుకొంటే మీరు పవిత్రులవుతారు. ప్రజాసేవలో, భగవంతుడి సేవలో మీ ఇంద్రియాలను, మనస్సును ఎంతోకొంత ఉపయోగించాలి, అలా ఉపయోగిస్తేనే అవి పవిత్రం అవుతాయి. మీ ఇంద్రియాలు నిర్మలం అయ్యాక, మీ మనస్సు పవిత్రం అయ్యాక వాలుగాలిలో సైకిలు తొక్కితే ఎలా ఉంటుందో అంతవేగంగా మీ మనస్సు హృదయాకారం చెందుతుంది. మన డబ్బు మనకోసం ఖర్చుపెట్టుకొని ఎంజాయ్‌చేస్తూ డబ్బు సద్వినియోగం అవుతోంది అనుకొంటాము. ఇతరులకు ఏదైనా సహాయం చేస్తే దుర్వినియోగం అయిపోయింది అనుకొంటాము. నిజానికి మనకోసం ఖర్చుపెట్టుకొన్నది దుర్వినియోగం అవుతుంది, ఇతరుల కోసం ఖర్చు పెట్టినది సద్వినియోగం అవుతుంది. ఇతరుల కోసం ఖర్చుపెట్టినది దేవుని బ్యాంక్‌లో వేస్తారు. అది మరణానంతరం మనకు ఉపయోగపడుతుంది. మనది మనమే తినేస్తే దేవుని బ్యాంక్‌లో పైసా ఉండదు, ఇంక మరణానంతర జీవితంలో సున్నా.

కొంతమంది సరిగా మాట్లాడరు, అసలు విషయం వదిలేసి ఏవో గాలి మాటలు చెపుతూ ఉంటారు. ఇటువంటి కపటంగల మనుషులకా ఆత్మసాక్షాత్కారం అంటాడు బైబిలులో. నిష్కపటి మాత్రమే నిష్కామకర్మ చేయగలడు. నిష్కామకర్మ చేసినవాడికి చిత్తశుద్ధి కులుగుతుంది, చిత్తశుద్ధి కలిగినవాడికి భగవదనుభవం కలుగుతుంది. ఈశ్వరుడికి శరణాగతి చేయటం వలన మనస్సు అణిగిపోతుంది. బాహ్యంగా విజృంభిస్తున్న మనస్సు అజ్ఞానాన్ని పోగుచేసుకొంటుంది. అణిగిన మనస్సు, అంతర్ముఖమైన మనస్సు ఆత్మజ్ఞానాన్ని పట్టి ఇస్తుంది. జ్ఞానం సంపాదించుకోవటానికి భగవంతుడు అనేక అవకాశములు ఇచ్చాడు. మనం ఎవరి ఇంటికి అయినా వెళ్ళాము అనుకోండి. మంచి మంచి కూరలతో, పిండివంటలతో అన్నం పెట్టారు అనుకోండి. నాకు భోజనం లేదు, నాకు భోజనం లేదు అని ఏడవటం ఎలా ఉంటుందో, భగవంతుడు ఇచ్చిన అవకాశములు ఉపయోగించటం మానేసి నాకు జ్ఞానం రాలేదని ఏడవటం కూడా అలాగే ఉంటుంది. నాలో ఉన్న బలహీనతలు ఏమిటి అని చూసుకొని వాటిని తొలగించుకోవటం వలన నువ్వు పవిత్రుడవు అవుతావు

అంతేగాని ఇతరుల బలహీనతలను లెక్కపెట్టటం వలన నువ్వు పవిత్రుడవు అవ్వవు సరికదా నువ్వు అపవిత్రుడవు అవుతావు. మీ హృదయంలో ఉన్న బ్రహ్మమే మీ కోసం ఒక శరీరం ధరించి వస్తే, బ్రహ్మమును శరీరానికి పరిమితం చేస్తున్నారు. కృష్ణుడు కూడా మనలాంటివాడే, మనలాగే పుట్టాడు, మనలాగే చనిపోయాడు అని మీరు అనుకొంటున్నారు కాని అందరి హృదయాలలో ఏదైతే ఉందో ఆ బ్రహ్మపదార్థమే కాళ్ళు చేతులు తొడుక్కొని వచ్చి బ్రహ్మం గురించి మనకు చెపుతోంది అన్న విషయం మీరు మిస్ అయిపోతున్నారు. ఆ చిన్న పాయింట్ మిస్ అయితే ఇంక లైఫ్ అంతా మిస్ అయిపోతారు.

జీవితం పొడుగునా మనం చేయవలసిన సాధన ఏమిటి అంటే మనం ఆ రోజుకారోజు అజ్ఞానాన్ని తగ్గించుకొంటూ రావాలి, జ్ఞానాన్ని పెంచుకోవాలి. మీ మొఖం మీద సత్పురుషుడు అని వ్రాసి ఉందా లేక దుష్టుడు అని వ్రాసి ఉందా లేదు. సత్పురుషుడి యొక్క లక్షణం ఏమిటి అంటే ఒక వ్యక్తిలో నూటికి 99 చెడుగుణాలు ఉన్నాయి అనుకో, ఒక్కటే మంచిగుణం ఉంది అనుకో, వాడిలో ఉన్న ఆ ఒక్క మంచిగుణం మీద వాడి మనస్సును పెట్టి ఉంచుతాడు, వాడే సత్పురుషుడు. వాడికి ఆ ఒక్క మంచిగుణమే కనిపిస్తుంది, ఇంకోటి అసలు వాడికి కనిపించదు, అది సత్పురుషుడి యొక్క లక్షణం. మనం చెడ్డవారము కాబట్టి అసలు మనకు మంచి కనబడదు, చెడ్డే కనిపిస్తుంది. ఎదుటివారిలో ఉన్న మంచిని మీరు ధ్యానం చేస్తే ఆ మంచి మిమ్మల్ని కూడా వరిస్తుంది, మీరు బాగుపడతారు. ప్రపంచంలో చాలా బాధలు పడుతున్నారు. ఆ బాధలు ఎలా తొలగించాలి అని అడుగుతున్నారు. ప్రపంచం బాధను తరువాత తొలగిందువుకాని ముందు నీ బాధను తొలగించుకో. ఇప్పుడు నువ్వు బాధలేకుండా ఉన్నావా? నీ బాధలో నుండి నువ్వు బయటకు రాలేకపోతున్నావు, ప్రపంచం బాధను నువ్వు పోగొడతావా? నువ్వు ప్రపంచం వంక చూడకు. నీ మనస్సును లోపలకు తిప్పి నీ లోపల ఏముందో చూసుకో. నువ్వు నేను, నేను అంటున్నావు కదా. ఆ నేనును విడిచిపెట్టి బాధలేదు, దానిని విడిచిపెట్టి అశాంతిలేదు, దానిని విడిచిపెట్టి దుఃఖం లేదు. అది ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీలేదు. ఈ నేను అనే తలంపు ఎక్కడ నుండి వస్తోందో చూసుకో, దానిని తీసుకొని వెళ్ళి అక్కడ ఉంచితే, అక్కడ ముంచితే ఈ నేను కరిగిపోతుంది, బ్రహ్మపదార్థం నీకు ఎరుకలోనికి వస్తుంది. అప్పుడు నీకు ఇతరులంటూ ఎవరూ లేరు, అప్పుడు నీవు బాధరహితస్థితిని, భయరహితస్థితిని పొందుతావు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-12-08, కాపవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు గీతాజయంతి. కురుక్షేత్రంలో కౌరవులకు, పాండవులకు యుద్ధం జరిగింది. తాతగారిని, గురువుగారిని, బంధువులను ఎలా చంపటం అని యుద్ధభూమిలో అర్జునుడికి విషాదం వచ్చింది. అర్జునుడి యొక్క విషాదం భగవద్గీత చెప్పటానికి దారితీసింది. అర్జునుడికి విషాదం రాదు అనుకోండి, అక్కడ భగవద్గీత రాదు. అంటే ఒక సంఘటన ఇంకో సంఘటనకు దారితీసింది. భగవద్గీతను స్వయంగా నారాయణుడే చెప్పాడు అంటే మన హృదయంలో ఉన్న భగవంతుడే మానవరూపం ధరించి వచ్చి చెప్పిన శాస్త్రం భగవద్గీత. ఆ పుస్తకం విలువ మనకు తెలియటం లేదు. శంకరాచార్యులవారు రాకముందు భగవద్గీత అంత ప్రచారంలో లేదు. గీతలో అమృతం ఉంది, దానిని ఎవరూ చదవటం లేదు, భక్తులు అందరూ మిస్ అయిపోతున్నారు అని ఆయన గీతలో ప్రతీ శబ్దానికి అర్థం వ్రాసి, వ్యాఖ్యానం వ్రాసి, దేశం అంతా కాలి నడకన తిరిగి ఆచార్యులవారు భగవద్గీతను ప్రచారం చేసారు. ఆయన వ్రాసింది ప్రజలకు అర్థమయ్యేలాగ బోధించాడు. భగవద్గీతలో పరమాత్మ ఏమన్నాడు అంటే ఓ అర్జునా! ఎవడు నాకు ఎక్కువ ప్రీతిపాత్రుడు అంటే నీకు నాకు మధ్య జరిగిన ఈ సంభాషణను, ఈ శాస్త్రాన్ని ఎవడైతే అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, ఇతరులకు అర్థమయ్యేలాగ భోదిస్తున్నాడో వాడు నాకు ప్రీతిపాత్రుడు, వాడు నా హృదయానికి సన్నిహితంగా ఉంటాడు అని పరమాత్మ చెప్పాడు.

కోరిక, కోపము, ద్వేషము, అసూయ, కక్ష ఇవి అన్నీ మన లోపలఉన్న శత్రువులు. బయటశత్రువులకంటే లోపలఉన్న శత్రువుల వల్ల ఎక్కువ ప్రమాదం, ఇది ఎప్పడూ మీరు గుర్తుపెట్టుకోండి. మనం లోపలఉన్న శత్రువులను వదిలేసి బయటఉన్న శత్రువులను తిడుతూ ఉంటాము. నీకు పునర్జన్మలను తీసుకొని వచ్చేది బయట శత్రువులుకాదు, లోపలశత్రువులే పునర్జన్మలను తీసుకొని వస్తున్నారు. ధనబలంకంటే ధర్మబలం గొప్పది అని పెద్దలు చెపుతారు. ధనానికి కూడా బలం ఉందికాని దానికంటే ధర్మబలం గొప్పది. ఆడంబరమైన మాటలు చెప్పేవారు, అహంకారమైన మాటలు చెప్పేవారు ఎందుకూ పనికిరారు. వారు పని ఏమి చేయరు, ఏవో డబ్బామాటలు చెప్పి వెళ్ళిపోతారు. ఎక్కువ మాట్లాడేవారికి ఏమీ తెలియదు, తెలిసినవారు ఎక్కువ మాట్లాడరు అని సామెత కూడా ఉంది. గీతలో పరమాత్మ అన్ని మార్గాల గురించి చెప్పాడు. ఆయన భక్తి మార్గం గురించి చెప్పాడు, కర్మమార్గం గురించి చెప్పాడు, జ్ఞానమార్గం

గురించి చెప్పాడు. రామకృష్ణ పరమహంసగారు భక్తిమార్గాన్ని ఎత్తి చూపారు, రమణమహర్షిగారు జ్ఞానమార్గాన్ని ఎత్తిచూపారు. ఇలా ఒకో ఋషి ఒకో మార్గాన్ని ఎత్తిచూపారు. కృష్ణుడు అలాగ చేయలేదు. ఎంజాయ్ ఎటర్నిటీ, ఎంజాయ్ బ్లిస్ ఎవ్విరివేర్ అని చెప్పాడు. అరుణాచలంలో మోక్షం ఉంది, కాశీలో మోక్షం ఉంది, ఇక్కడ ఏమీలేదు అంటే మీకు సబ్జక్టు అర్థమవ్వలేదు అని పరమాత్మ చెప్పాడు. ప్రపంచంలో మనుషులు రకరకాలుగా ఉంటారు. ఏ ఇద్దరి బిహేవియర్ ఒక రకంగా ఉండదు, భిన్నత్వం ఉంటుంది, ఇది ప్రకృతి. ఈ అనేకత్వంలో, భిన్నత్వంలో అంతర్యామిగా ఉన్న నారాయణుడిని ఎలా చూడాలో గీతలో పరమాత్మ వివరంగా చెప్పాడు. అది గీత యొక్క వైభవం. మనుషులు రకరకాలుగా ఉంటారు. వారి శరీరాలు వదిలేయండి, వారి మనస్సులు వదిలేయండి, వారి గుణాలు వదిలేయండి, వారి జన్మల గొడవ వదిలేయండి. అన్నింటిని వదిలేసి అందరిలోను అంతర్యామిగా ఉన్న నన్ను చూడండి అనిపరమాత్మ చెపుతున్నాడు. పరమాత్మ మన హృదయంలో ఉన్నాడు. ఆయన ఉన్న గుహలోనికి మనం వెళ్ళాలంటే కేవలం మన తెలివితేటలు సరిపోవు. మేము మంచివారము, దానాలు చేసాము, ధర్మాలు చేసాము అని మీలో మీరు అనుకొన్నా లోపలకు వెళ్ళలేరు. మన హృదయంలో ఉన్న పరమాత్మకు మన మీద దయకలిగి ఆయన మనలను లాక్కొంటే మనం లోపలకు వెళ్ళగలము కాని మన ప్రయత్నం వలన అది సాధ్యంకాదు.

మీకు ఏదైనా కోరిక ఉంది అనుకోండి. ఆ కోరికలో నుండి కోపం వచ్చేస్తుంది. మీ పని ఎవడైనా చెడగొడితే వాడి మీద ద్వేషం వచ్చేస్తుంది, కక్ష వచ్చేస్తుంది. మీరు అరుణాచలం వెళ్తాను అంటే మీ ఆయన వద్దంటారు అనుకోండి, వెంటనే విరోధం, పైకి విరోధం నటించకపోయినా లోపల మానసికంగా దూరమైపోతారు. మీకు ఏ రకమైన కోరిక ఉన్నా అన్ని చెడ్డగుణాలు ఉన్నట్లే. మనం ఏదైనా ఒక మాట మాట్లాడేటప్పడు పదిసార్లు ఆలోచించికాని ఒకమాట మాట్లాడకూడదు, పదిసార్లు ఆలోచించికాని ఒక పని చేయకూడదు. నిన్ను నీవు తెలుసుకోవటంకంటే మించిన పనికాని, నిన్ను నీవు తెలుసుకోవటంకంటే మించిన జ్ఞానంకాని, నిన్ను నీవు తెలుసుకోవటంకంటే మించిన సాధన కాని ఏమైనా ఉందా అని పరమాత్మ అడుగుతున్నాడు. నీవు ఎవరో నీకు తెలియనప్పడు నీకు ఎంత ధనం ఉన్నా, ఎంత తెలివి ఉన్నా ఒకటి లేని సున్నలతో సమానము. నిన్ను నీవు తెలుసుకోవటంకంటే మించిన వైభవం ఏమైనా ఉందా? ఏమీ లేదే అంటున్నాడు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా రాగద్వేషములు ఉంటాయి. అసలు మనకు ఎవరిమీద ఇష్టంలేదు అనుకోండి, ఎవరి మీద ద్వేషం లేదు

అనుకోండి. ఇంక మన మనస్సును బయటకు వెళ్ళమని గెంటినా అది వెళ్ళదు. మన కుటుంబంలో భార్యాభర్తల మధ్య, పిల్లల మధ్య ఉన్న ప్రేమలు కూడా నిజంకాదు, ఇదో నాటకం. మీ అమ్మాయిలలో ఒకరికి పది రూపాయలు ఎక్కువపెట్టి, ఇంకొకరికి పది రూపాయలు తక్కువ పెడితే వెంటనే వారు విరోధులు అయిపోతారు. ఇదంతా ప్రకృతి, ఈ ప్రకృతిలో ఉన్నప్పుడు ప్రకృతి లక్షణాలతోటే ఉంటావు. ఈ ప్రకృతిని దాటకుండా నీకు ఆత్మజ్ఞానం కలుగదు. ఈశ్వరానుగ్రహం లేకుండా, ఈశ్వరుని దయలేకుండా ఈ ప్రకృతిని నీవు ఓవర్‌కమ్ చేయలేవు.

నువ్వు ఏదైనా మాట్లాడేటప్పుడుగాని, ఏదైనా ఒక పని చేసేటప్పుడుగాని బాహ్యంగా ఈశ్వరుడు ఏమీ చూడడు. ఆ మాట మాట్లాడేటప్పుడు నీ తలంపు ఏమిటి, ఆ పని చేసేటప్పుడు నీ ఆలోచన ఏమిటి అని లోపల నీ మనస్సును, నీ హృదయాన్ని చూస్తాడు కాని బయట పనులు ఈశ్వరుడికి అక్కరలేదు. నువ్వు పని పనికోసమే చెయ్యి అప్పుడు ఈశ్వరుని దయకు పాత్రుడవుతావు. దేహం అబద్ధం, చావు అబద్ధం అన్నాడు సనత్‌కుమారుడు. దేహమే కల్పితం, ఇంక కల్పితానికి చావు ఏమిటి అన్నాడు. గాఢనిద్రలో ఎవరికైనా దేహం గొడవ ఉందా? లేదు. జాగ్రదవస్థలో నేను అనే తలంపు వచ్చాక అన్నీ వస్తున్నాయి. దేహమే నేను అనేది ఒక తలంపు. అలాగే చావు కూడా నిజంకాదు, ఇది కూడా ఒక తలంపే. నేను అనే మూలతలంపు ఉన్నప్పుడు ఇవి అన్నీ ఉన్నాయి లేకపోతే ఏదీ లేదు. నువ్వు కాని దేహంతోటి, నువ్వుకాని మనస్సుతోటి, నువ్వు కాని సమాజంతోటి, నువ్వు కాని పరిసరాలతోటి ఎంత కాలమైతే తాదాత్మ్యం పొందుతావో అంతకాలం ఈ భయాలు, చావులు, పుట్టుకలు నిన్ను వెంటాడుతూనే ఉంటాయి, ఎవరూ ఆపుచేయలేరు. మీకు బయట కారణాల వలన సంతోషం వస్తూ ఉన్నా, దుఃఖం వస్తూ ఉన్నా వాటిని బయటే వదిలేయండి. వాటిని లోపలకు తీసుకోవద్దు. వాటిని లోపలకు తీసుకొంటే అంతా పాయిజన్ అయిపోతుంది, మిమ్మల్ని మోక్షానికి రానివ్వరు, దారిలోనే అడ్డంగొట్టి బయటకు గెంటేస్తారు.

మనం బాగా సంతోషంగా ఉన్నప్పుడు తెలుసున్నవారిని కూడా మీరెవరు అంటాము, దుఃఖంగా ఉన్నప్పుడు డిప్రెషన్‌లోనికి వెళ్ళిపోతాము. నువ్వు బెంగపెట్టుకోవటానికి అసలు ఏమైనా ఉంటే కదా, నీకు డిప్రెషన్ దేనికి వచ్చింది? రాంగ్‌తింకింగ్‌లోనుండి ఇవి అన్నీ వస్తున్నాయి. నాకు రాంగ్‌తింకింగ్ ఉందని ఏడుస్తూ కూర్చోకూడదు. రాంగ్‌తింకింగ్‌లో నుండి రైట్‌తింకింగ్‌లోనికి మారాలి. కొత్తకొత్త గురువులు వచ్చేసారు. ఏదో ఒక కోణాన్ని పట్టుకొని ఇదే

సర్వస్వం అని చెప్పేస్తున్నారు. మనం భగవద్గీతను వదిలేస్తున్నాము. భగవద్గీతను చదివి అర్థం చేసుకొంటే ఆత్మజ్ఞానం మీ చేతిలో ఉంటుంది. కొంతమంది జ్ఞానమార్గానికి ఇచ్చిన విలువ కర్మమార్గానికి ఇవ్వరు. భగవద్గీతలో అన్నీ సమన్వయం చేసాడు. పరమాత్మ ఏమని చెప్పాడు అంటే జ్ఞానమార్గం నిన్ను ఎక్కడికి తీసుకొని వెళుతుందో కర్మమార్గం కూడా అక్కడికే తీసుకొని వెళుతుంది. అది వేరు, ఇది వేరు అని నీకు ఎవరైనా చెపితే చంటిపిల్లల మాటలకింద ఆ మాటలను వదిలేయండి, అటువంటి మాటలను భుజాన వేసుకొని తిరగవద్దు అని చెప్పాడు. ఇతరులను బాగుచేద్దాము అనుకొనే బదులు ముందు నువ్వు బాగుపడు. సంస్కర్తలు కావలెను, సంస్కర్తలు కావలెను, ఇతరులను సంస్కరించే వాళ్ళుకాదు, వాళ్ళని వాళ్ళు సంస్కరించుకొనే వారు కావలెను. నీ మనస్సును బాగు చేసుకోవటంకంటే మించిన పని ఏమైనా ఉందా? సత్కర్మ నిష్కామంగా ఎందుకు చేయమన్నారు అంటే దాని వలన మనస్సు ఏకాగ్రమవుతుంది, నిర్మలమవుతుంది, పరిశుద్ధమౌతుంది. మీకు నాది అనే తలంపు ఉన్నప్పుడు మీకు ఒక్క ఎకరం ఉంటే చాలు దానివలన ప్లెజర్ వచ్చేస్తుంది. నాది అనే తలంపు మీకు లేనప్పుడు మీకు వెయ్యి ఎకరాలు ఉన్నా దానివలన మీకు బాహ్యం నుండి ఏమీ సంతోషం రాదు.

నువ్వు సాధన చేసి ఇష్టాలు, అయిష్టాలు తగ్గించుకోవాలి. ఎందుచేతనంటే ఇష్టాలు, అయిష్టాలు ఉన్నంతసేపు మీరు ఎంత ప్రయత్నం చేసినా మనస్సు బయటకు పోతూ ఉంటుంది, దానిని ఎవరూ ఆపలేరు. మన హృదయంలో పరమాత్మ అంతర్యామిగా ఉన్నాడు. కాని మన మనస్సులో రాగద్వేషములు ఉన్నంతకాలం ఆయన మనకు అనుభవంలోనికి రాడు. మనస్సు అనే గడప దాటనంతకాలం మనం ప్రకృతిలో ఉన్నట్లే, మనకు జన్మలు వస్తూనే ఉంటాయి. నువ్వు సంపాదించేది ఏమీ లేదు, ఊడగొట్టుకోవలసిందే ఉంది. అంటే ఉన్నదేదో ఉంది, అది నీకు అనుభవంలోనికి రాకుండా ఏవైతే అడ్డు వస్తున్నాయో వాటిని తొలగించుకోవటానికే సాధన. అంతఃకరణాన్ని శుద్ధి చేసుకో. అది ఎలా ఉంది, ఆత్మజ్ఞాన సముపార్జనకు ప్రిపేర్ అవుతోందా, లేదా అని పరిశీలన చేసుకో. మీరు మనస్సును బాగు చేసుకొంటే మీరు ఇంట్లో ఉన్నా సన్యాసంలో ఉన్నట్లే. అంటే పని చేస్తూ ఉంటారు, వ్యక్తిగతమైన కోరిక ఏమీ ఉండదు. జనం అందరూ గంగానదిలో స్నానంచేసి మా పాపాలు పోయినాయి అని వచ్చేస్తున్నారు అంటే వారి పాపాలు అన్నీ గంగానదికి అప్ప చెప్పేసి వస్తున్నారు. మరి గంగానదిలో పాపాలు ఎలా పోతాయి అంటే ఒక మహాత్ముడు, ఒక మహర్షి, ఒక బ్రహ్మజ్ఞాని వెళ్ళి గంగానదిలో స్నానం చేస్తే

గంగానదిలో ఉన్న పాపం అంతాపోతుంది అని చెప్పారు, అది బ్రహ్మజ్ఞానం యొక్క వైభవం. మంచి చెడ్డా మనస్సులో ఉన్నాయి. వారు మంచివారు, వీరు చెడ్డవారు అని ఈ రెండింటి మధ్య తిరుగుతూ ఉంటే మీరు హృదయంలోనికి దిగలేరు. వారు తిట్టారు, వీరు కొట్టారు అని రోజూ ఏడుస్తూ ఉంటే ఇంక నీకు ఆత్మజ్ఞానం ఏమిటి? అసలు భూతకాలం మోసేవాడికి ఎవడికి బ్రహ్మజ్ఞానం కలుగదు. భగవంతుడు చెయ్యమని చెప్పినపనిని మనకు ఇష్టం లేకపోయినా చెయ్యాలి, ఆయన వద్దని చెప్పిన పనిని మానెయ్యాలి. ఎందుకు అని తర్కానికి వెళ్ళకూడదు. అలా తర్కానికి వెళితే బుర్ర పాడైపోతుంది. ఆయన చెప్పాడు కాబట్టి చెయ్యండి, తరువాత వచ్చే ఫలితం ఆయనే చూసుకొంటాడు. మిమ్మల్ని ఎప్పుడు అనుగ్రహించాలి, ఎలా అనుగ్రహించాలి అనేది భగవంతుడే చూసుకొంటాడు. మీరు అద్వైతం దాకా వెళ్ళిపోనక్కరలేదు. ద్వైతంలో కూడా మీరు భగవంతుడిని ఎంజాయ్ చెయ్యండి. అలా ఎంజాయ్ చెయ్యగా చెయ్యగా మీకు తెలియకుండా ఆయనలో ఐక్యమైపోతారు అని రాధాకృష్ణన్ చెప్పారు.

కృష్ణుడు చెప్పింది నాకు రోజూ జ్ఞాపకం వస్తోంది. ఎంజాయ్ ఎటర్నిటీ, ఎంజాయ్ బ్లిస్ ఎవ్విరివేర్ అండ్ ఎవ్విరిటైమ్. గుడిలోకి వెళితే నాకు శాంతిగా ఉంటోంది, ఇంట్లో ఉంటే శాంతిగా లేదు. అరుణాచలంలో బాగుంది, కాపవరంలో ఏమీ బాగాలేదు అంటే ఆ మాటలకు అర్థం ఏమిటి? అలా అనుకొంటూ ఉంటే మీకు సబ్జక్టు అర్థం కావటంలేదు. ఒక కాలంలో ఉండి ఇంకొక కాలంలో లేకపోతే, ఒక ప్రాంతంలో ఉండి, ఇంకో ప్రాంతంలో లేకపోతే వాడు దేవుడు ఎలా అవుతాడు. మనకు భక్తి ఉంది అని అనుకొంటున్నాము కాని మనకు భక్తిలేదు ఎందుచేతనంటే భక్తిలేని మూలంగానే భగవంతుడు చెప్పిన మాట మీద మనకు నమ్మకం కలగటంలేదు. నమ్మకం కలగటానికి లోపల మనకు చిత్తశుద్ధి లేదు, తగిన యోగ్యత, అర్హత మనకు లేవు. భగవద్గీత చెప్పినవాడు కృష్ణుడు, విన్నవాడు కృష్ణుడు, వ్రాసిన వాడు కృష్ణుడు కాని మనం ఏమనుకొంటున్నాము ఈ ముగ్గురూ వేరు అనుకొంటున్నాము. ఈ ముగ్గురూ ఆయనే, అదే గీత యొక్క మహత్యం. ఉపనిషత్‌లో ఋషులు వారి అనుభవాలు చెప్పారు కాని భగవద్గీత అలా కాదు ఆ సృష్టికంతకు ఎవడైతే యజమానో వాడి మొఖంలో నుండి వచ్చిన గ్రంధం, అది గీత యొక్క వైభవం. మీరు బాగుపడటానికి 90 పుస్తకాలు అక్కరలేదు. విష్ణుసహస్ర నామాలు పారాయణ చేసుకోండి, భగవద్గీత చదువుకోండి. మిగతావి ఏమీ చదువుకోవద్దు అనికాదు, మీరు బాగుపడటానికి ఈ రెండూ చాలు.

మనం భగవంతుడిని ఏదో ఒకటి కోరుకొంటూ ఉంటాము, ఆయన ఇస్తూ ఉంటాడు. నిజంగా మీ భక్తి ఆ కోరిక కోసమైతే, ఈ జన్మలో ఇవ్వకపోయినా రాబోయే జన్మలో అయినా అది ఇస్తాడు కాని మోక్షం మాత్రం ఇవ్వడు, అది ఆలోచించుకోండి. మోక్షం ఎప్పుడు వస్తుంది అంటే మీకు భగవంతుడి మీద భక్తి ఉండాలి, ఎక్కడా కోరిక కనపడకూడదు. ఇది ఇలా ఎందుకు జరిగింది, అది అలా ఎందుకు జరిగింది అని అనుకోవద్దు. మీ శరణాగతి నిజమైతే అలా అనుకోరు. మీకు ఏది జరిగినా అది భగవంతుడికి తెలియకుండా జరగటం లేదు. మీ కోడలు రాక్షసి అనుకోండి, మీలో ఉన్న కొన్ని వాసనలను తీసేయటానికే ఆ రాక్షసిని అక్కడ పెట్టాడు కాని లేకపోతే దేశంలో ఇన్ని కుటుంబాలు ఉండగా ఆవిడ మీ ఇంటికే రావటం ఏమిటి? మీకు ఏవో పాఠాలు నేర్పటానికే అక్కడ సిద్ధం చేసాడు. ఆ కోడలు మొట్టికాయలు మొడితేకాని మీ మనస్సు లోపలకు తిరగదు, మనస్సు లోపలకు వెళితేగాని మీకు జ్ఞానం రాదు. జీవకోటిని ఒకోసారి తలుపు సందున పెట్టి నొక్కుతాడు, అలా చేస్తేగాని మనకు బుద్ధి రాదు. ఈశ్వరుడు చెప్పిన మాట యందు మనకు విశ్వాసం ఉండాలి. మీరు గొప్ప పండితులు అవ్వనక్కరలేదు. మీరు శాస్త్రాన్ని పూర్తిగా నమ్ముతున్నారు అనుకోండి, అప్పుడు తన హృదయాన్ని మీకు ఇచ్చేస్తుంది, అప్పుడు శాస్త్రం వెనకాల ఉన్న అర్థం మీ హృదయంలో ప్రవేశిస్తుంది, అది శాస్త్రానుగ్రహం. ఈశ్వరానుగ్రహం లేకుండా, శాస్త్రానుగ్రహం లేకుండా మనకు ఆత్మజ్ఞానం కలుగదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-11-08, గొరగనమూడి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

పరావిద్య అంటే నిర్వాణస్థితికి తీసుకువెళ్ళే విద్య. అపరావిద్య కేవలం వరల్డ్‌కి సంబంధించినది. జ్ఞానానందస్వామి అపరావిద్య, పరావిద్య ఈ రెండింటిలోను కృషి చేసారు. ఆయనకు రెండూ తెలుసు. నేను చాలా విద్యలు నేర్చుకున్నాను అయినా నాకు హృదయంలో తృప్తి కలగటంలేదు, లోపల ఏదో వెలితి ఉంది అనిపిస్తోంది, నాకు శాంతిలేదు అని నారదుడు సనత్కుమారుడుని అడిగితే అప్పుడు ఆత్మవిద్య గురించి సనత్‌కుమారుడు చెబుతాడు. ఆత్మ విద్యవల్ల ఆత్మజ్ఞానం పొంది పరిపూర్ణమైన శాంతిని పొందాడు నారదుడు. అర్జునా! విద్యలలో ఆత్మవిద్యను నేను అన్నాడు పరమాత్మ. నువ్వు ఎన్ని విద్యలు నేర్చుకొన్నా నీకు ఆత్మవిద్య లేకుండా, ఆత్మవైభవం తెలియకుండా నీకు ఆత్మసుఖం రాదు అన్నాడు పరమాత్మ. మీలో బాగా చదువుకున్నవాళ్ళు ఉండవచ్చు, ధనవంతులు ఉండవచ్చు, అధికారులు ఉండవచ్చు, కీర్తి